

'తిరుపతి'లో కూటమి రెడీ

- అసెంబ్లీ అభ్యర్థిగా జనసేన తరపున ఆరణి శ్రీనివాసులే
- బీజేపీ ఎంపీ టికెట్ వరప్రసాదరావుకు
- శాసనసభ స్థానంపై సద్దుమణగనున్న అసమ్మతి

జిల్లాలో పెండింగ్ స్థానాలకు కూటమి పార్టీలు అభ్యర్థులను ప్రకటించాయి. జిల్లావ్యాప్తంగా పక్షం రోజుల పాటు రాజకీయ వర్గాల్లో ఆసక్తిని, తిరుపతిలో జనసేన, టీడీపీ, బీజేపీలో అలజడిని రేకెత్తించిన జనసేన అసెంబ్లీ సీటు.. ఎట్టకేలకు ఆరణి శ్రీనివాసులుకే ఖరారైంది. మరోవైపు గూడూరు సిట్టింగ్ ఎమ్మెల్యే వరప్రసాదరావు తిరుపతి ఎంపీ స్థానానికి కూటమి తరపున బీజేపీ అభ్యర్థిగా బరిలో నిలవనున్నారు. దీంతో జిల్లాలో అన్ని స్థానాలకూ కూటమి పార్టీలు ఉమ్మడి అభ్యర్థులను ప్రకటించేసినట్టయింది. తిరుపతి అసెంబ్లీ సెగ్మెంట్‌లో ఇప్పటి దాకా కొనసాగిన స్థానిక-స్థానికేతర వివాదాలకు ఇక ముగింపు పలికినట్టయింది. ఉమ్మడి అభ్యర్థి గెలుపు కోసం టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు కలసికట్టుగా ప్రచారంలోకి దిగే అవకాశముంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

జనసేన సీటు ఆరణికే



పేరు: ఆరణి శ్రీనివాసులు
పుట్టిన తేది: 15-5-1952
స్వస్థలం: జంగాలపల్లి, యాదమరి మండలం
నివాసం: చిత్తూరు
భార్య: సత్యవతి
కుమారులు: మదన్ మోహన్, జగన్‌మోహన్
వృత్తి: రాజకీయం, జేఎంసీ కన్‌స్ట్రక్షన్స్

తిరుపతి అసెంబ్లీ సీటు ఏ పార్టీకి కేటాయిస్తారు? అభ్యర్థిగా ఎవరు ఖరారవుతారు? అన్న ప్రశ్నలు జిల్లావ్యాప్తంగా జనంలోనూ, రాజకీయ వర్గాల్లోనూ ఆసక్తి రేపిన సంగతి తెలిసిందే. తిరుపతి ప్రాధాన్యత దృష్ట్యా అందరి దృష్టీ దీనిపైనే పడింది. తొలినుంచీ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇక్కడి నుంచే పోటీ చేస్తారన్న ఊహాగానాలు మొదలయ్యాయి. టీడీపీతో జనసేన జతకట్టడంతో ఈ ప్రచారం మరింత ఎక్కువైంది. అయితే ఎందుకో తిరుపతి సీటుపై పవన్ ఆసక్తి చూపలేదు. దీంతో టీడీపీ, జనసేన నేతల నడుమ టికెట్ కోసం పోరు మొదలైంది. చివరి దశలో బీజేపీ నేతలూ రేసులోకి వచ్చారు. చివరికి ఈనెల 13వ తేదీ నాటికి తిరుపతి సీటు పొత్తులో భాగంగా జనసేనకు కేటాయించినట్టు తేలిపోయింది. దానికి తోడు చిత్తూరు వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు జనసేనలో చేరడంతో ఆయనకే టికెట్ ఖరారైందని పార్టీ వర్గాలకు సమాచారమందింది. దీంతో 14వ తేదీన తిరుపతి టీడీపీ, జనసేన నేతలు సమావేశమై స్థానికులకే టికెట్ ఇవ్వాలని, లేదంటే బయటి వారికి సహకరించకూడదని తీర్మానించారు. ఆరణి శ్రీనివాసులు గో బ్యాక్ అంటూ సాయంత్రానికే ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు దర్శనమిచ్చాయి. అదే రోజు రాత్రి తిరుపతి చేరుకున్న ఆరణి శ్రీనివాసులు 15న నగరంలోని ముఖ్య ఆలయాల్లో పూజలు జరిపి లాంఛనంగా ప్రచారం ప్రారంభించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతల ఇళ్లకు వెళ్లి వారిని కలిసి మద్దతు కోరేందుకు యత్నించారు. అయితే జనసేనలో డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, టీడీపీలో కోడూరు బాలసుబ్రమణ్యం మినహా మిగిలిన వారు అధినేతలు చెబితే తప్ప మద్దతివ్వమని చెప్పేశారు. వీరితో సర్దుబాటుకు ప్రయత్నిస్తూనే మరోవైపు శ్రీనివాసులు తన పని తాను చేసుకుంటూ పోయారు. పార్టీ ఎన్నికల కార్యాలయం కూడా ప్రారంభించారు. దానికి ఎవరూ హాజరు కాకపోగా అదే రోజు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ నాయకత్వంలో టీడీపీ నాయకులు సమావేశమై స్థానికులకే టికెట్ ఇవ్వాలని అధిష్ఠానాన్ని డిమాండు చేశారు. స్థానికేతరులకు పనిచేయమని తేల్చి చెప్పారు. జనసేన నేతలను కూడా నాగబాబు మంగళగిరికి పిలిపించి మాట్లాడి పంపించారు. దీంతో అధిష్ఠానం పునరాలోచనలో పడిందని, అభ్యర్థిని మార్చేందుకు కసరత్తు చేస్తోందని ప్రచారం మొదలైంది. అయితే దానికి భిన్నంగా ఆదివారం జనసేన అధిష్ఠానం అధికారికంగా తిరుపతి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులంటూ ప్రకటన జారీ చేసింది. దీంతో అభ్యర్థి మార్పుపై తలెత్తిన ఊహాగానాలు, ప్రచారాలన్నీ బంద్ అయ్యాయి. కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, శ్రేణులు కలసికట్టుగా ఉమ్మడి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు గెలుపు కోసం పనిచేయాల్సిన పరిస్థితి తలెత్తింది.అధికారిక ప్రకటన వెలువడ్డాక అసమ్మతి, అసంతృప్తి వ్యక్తం చేయడం లేదా స్థానికేతర అభ్యర్థి అంటూ వివాదం లేవనెత్తడం అధిష్ఠానాన్ని ధిక్కరించడమే అవుతుంది. టీడీపీ, జనసేన పార్టీలకు కీలకమైన ఈ ఎన్నికల్లో అధిష్ఠానాలను ధిక్కరించే ప్రయత్నం నేతలు చేయరన్న భావన సర్వత్రా వ్యక్తమవుతోంది. దీంతో ఒకటి రెండు రోజుల్లో అంతా కలసికట్టుగా ప్రచారం ప్రారంభించే పరిస్థితులు కనిపిస్తున్నాయి.

నేపథ్యం: క్లాస్ వన్ కాంట్రాక్టరు అయిన ఆరణి.. ప్రజారాజ్యం పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2009 ఎన్నికల్లో ఆ పార్టీ తరపున చిత్తూరు అసెంబ్లీకి పోటీ చేసి ఓటమి చెందారు. ఆపై టీడీపీలో చేరి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2014 ఎన్నికల్లో అసెంబ్లీ టికెట్ ఆఖరి నిమిషంలో చేజారడంతో వైసీపీలో చేరి.. పోటీ చేసి ఓటమి చెందారు. 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి చిత్తూరు ఎమ్మెల్యేగా గెలిచారు. ఇప్పుడు వైసీపీ మొండిచేయి చూపడంతో ఈనెల 7న జనసేనలో చేరిన ఆయన.. తిరుపతి టికెట్ సాధించారు.

అందరినీ కలుపుకొని పోతా

టికెట్ ఆశించిన ఆశావహుల్లో అసంతృప్తులు ఉండడం సహజమే. అందరినీ కలుపుకొని ముందుకు పోతా. తిరుపతిలో నాకు సొంతిల్లు, వ్యాపార లావాదేవీలు, బంధువర్గం ఉంది. ప్రజారాజ్యం, తెలుగుదేశం పార్టీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా పనిచేయడంతో తిరుపతితో రాజకీయంగా, సామాజికంగా మెరుగైన పరిచయాలు ఉన్నాయి. మిత్రపక్షాల సహకారంతో జనసేన పార్టీ విజయం సాధిస్తుంది.

- ఆరణి శ్రీనివాసులు, జనసేన అభ్యర్థి

బీజేపీ ఎంపీ అభ్యర్థిగా వరప్రసాదరావు



ఢిల్లీలో కేంద్రమంత్రి అనురాగ్‌సింగ్ ఠాకూర్ సమక్షంలో ఆదివారం బీజేపీలో చేరుతున్న వరప్రసాదరావు

పొత్తులో భాగంగా తిరుపతి ఎంపీ సీటును బీజేపీకి కేటాయించిన సంగతి తెలిసిందే. ఆ పార్టీ తరపున గత ఉప ఎన్నికల్లో పోటీ చేసిన రిటైర్డు ఐఏఎస్ అధికారి రత్నప్రభ గానీ లేదా ఆమె కుమార్తె గానీ అభ్యర్థిగా ఉంటారన్న ప్రచారం జరిగింది. ఆ అంచనాలకు భిన్నంగా గూడూరు వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే వరప్రసాదరావుకు అవకాశం దక్కింది. రిటైర్డు ఐఏఎస్ అధికారి అయిన ఈయన.. 2009లో ప్రజారాజ్యం పార్టీ ద్వారా రాజకీయాల్లోకి ప్రవేశించారు. ఆ ఏడాది తిరుపతి నుంచీ ఆ పార్టీ తరపున ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. 2014లో వైసీపీలో చేరి తిరుపతి నుంచీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి గెలిచారు. 2019లో గూడూరు నుంచీ అదే పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఈ సారి వైసీపీ అధిష్ఠానం ఆయనకు టికెట్ ఇవ్వకుండా మొండిచేయి చూపడంతో పార్టీకి దూరమయ్యారు. గత నెలన్నరగా ఆయన తిరుపతి పార్లమెంటు పరిధిలో తన అనుచరులను కలుసుకుని మద్దతు కోరారు. ఆదివారం ఢిల్లీలో బీజేపీ తీర్థం పుచ్చుకుని.. ఆ వెంటనే తిరుపతి ఎంపీ అభ్యర్థి అయ్యారు.

పేరు: వెలగపల్లి వరప్రసాదరావు
తల్లిదండ్రులు: మేరి, చిరంజీవులు
పుట్టిన తేదీ : 18-10-1953
స్వస్థలం : కృష్ణా జిల్లా, కొమ్మపూడి గ్రామం
భార్య : లక్ష్మి
కుమారుడు : నవీన్ గుప్తా
కుమార్తె : డాక్టర్ స్ఫూర్తి
విద్యార్హతలు, ఉద్యోగం: బయోకెమిస్ట్రీలో పీజీ. తమిళనాడు క్యాడర్‌లో 1983 బ్యాచ్‌కి చెందిన ఐఏఎస్ అధికారిఅయిన ఈయన ఆ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగానూ పనిచేశారు.

ఉదయం పార్టీలో చేరి.. సాయంత్రం టికెట్ తెచ్చుకుని

గూడూరు సిట్టింగ్ ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాదరావు అన్నంత పని చేశారు. గూడూరు సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన ఆయనకు వైసీపీ అధిష్ఠానం మొండిచెయ్యి చూపింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆయన.. చడీచప్పుడు లేకుండా తిరుపతి పార్లమెంటు పరిధిలో పర్యటించారు. గతంలో ఎంపీగా పనిచేసిన సమయంలో తనతో సన్నిహితంగా మెలిగిన అనుచరులను కలుసుకున్నారు. ఏదో ఒక పార్టీ తరపున ఎంపీగా పోటీ చేస్తానని, తనకు మద్దతివ్వాలని కోరుతూ వచ్చారు. ఆయన ప్రయత్నాలను ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. పొత్తులో భాగంగా తిరుపతి సీటు బీజేపీకి దక్కుతుందనే అంచనాలు రాజకీయ వర్గాల్లో ముందునుంచీ ఉన్నాయి. ఈ క్రమంలో చాప కింద నీరులా ప్రయత్నాలు సాగించిన ఆయన ఢిల్లీకి వెళ్ళి ఆదివారం ఉదయం బీజేపీలో చేరారు. సాయంత్రానికల్లా ఆ పార్టీ ప్రకటించిన ఎంపీ అభ్యర్థుల జాబితాలో తిరుపతి సీటు దక్కించుకుని అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురి చేశారు.

జోరందుకోనున్న 'కూటమి' ప్రచారం

ఇప్పటి వరకూ తిరుపతి అసెంబ్లీ, ఎంపీ సీట్లకు మాత్రమే కూటమి పార్టీలకు సంబంధించి అభ్యర్థుల ఎంపిక పెండింగులో ఉండేవి. మిగిలిన స్థానాలకు అభ్యర్థులను అధికారికంగా ప్రకటించేశారు. ఆయా చోట్ల అభ్యర్థులు ప్రచార రంగంలో దూసుకెళుతుండగా ఈ రెండు స్థానాల్లో మాత్రమే కూటమి పార్టీల కార్యకలాపాలు, ప్రచారాలూ స్తంభించిపోయాయి. ఆదివారం రెండింటికీ అభ్యర్థులను అధికారికంగా ప్రకటించడంతో జిల్లా వ్యాప్తంగా మూడు పార్టీల్లో పూర్తిస్థాయిలో ప్రచార కార్యక్రమాలు జోరందుకోనున్నాయి.

దశాబ్ది ప్రయాణమిలా

- ఎస్వీయూలో బీఏ ఎల్ఎల్‌బీ ఇంటిగ్రేటెడ్ కోర్సుకు పదేళ్లు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మార్చి 24: శ్రీవేంకటేశ్వర (ఎస్వీ) యూనివర్సిటీలో 1974లో లా విభాగం ఏర్పాటైంది. ఇప్పటివరకు అనేక మంది పీజీ, పీహెచ్‌డీలు పూర్తిచేశారు. ఇదే విభాగంలో 2013 నుంచి ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ ఇంటిగ్రేటెడ్ కోర్సును ప్రారంభించారు. ఈ ఏడాదితో ఈ కోర్సు పదేళ్ల కాలాన్ని పూర్తి చేసుకుంది. ఈ కోర్సు పూర్తి చేసినవారు న్యాయమూర్తులుగా, న్యాయవాదులుగా, పలు కంపెనీల న్యాయ సలహాదారులుగా స్థిరపడ్డారు. ఈ కోర్సులో భాగంగా విద్యార్థులను హైకోర్టు, సుప్రీంకోర్టుతోపాటు జైళ్ల పరిస్థితులను అవగాహన చేసుకోవడానికి క్షేత్ర పర్యటనలూ ఉంటాయి. తాజాగా ఢిల్లీలోని సుప్రీంకోర్టుకు తీసుకెళ్లారు. ప్రతినెలా న్యాయమూర్తులు, న్యాయవాదులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ కోర్సును ఇప్పటివరకు 135 మంది పూర్తి చేశారు. 247 మంది చదువుకుంటున్నారు. వీరికి 8 మంది అకడమిక్ కన్సల్టెంట్లు, ఐదుగురు గెస్ట్ ఫ్యాకల్టీ బోధన చేస్తున్నారు. ఈ కోర్సుకు గౌరవ డీన్‌గా ప్రొఫెసర్ వీఆర్సీ కృష్ణయ్య వేతన రహిత సేవలను అందిస్తుండటం గర్హనీయం.

ఏపీ లాసెట్ ర్యాంకు ద్వారానే అడ్మిషన్

ఏపీ లాసెట్‌లో వచ్చిన ర్యాంకు ద్వారానే ఈ కోర్సులో అడ్మిషన్ ఉంటుంది. ప్రస్తుతం 55 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 40 సీట్లను ర్యాంకులు, కేటగిరీలవారీగా, ఐదు మాత్రం ఆర్థిక వెనుకబడిన ఉన్నత వర్గాలు, 10 సీట్లను సెల్ఫ్ సపోర్టింగ్ ద్వారా భర్తీ ఇస్తారు. జనరల్ కేటగిరీలో అయితే ఏడాదికి రూ.40వేలు, సెల్ఫ్ ఫైనాన్స్ అయితే ఏడాదికి రూ.90వేల ఫీజు చెల్లించాలి. వీటికి ప్రభుత్వం నుంచి స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం ఉంది. ఈ కోర్సుకు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు ఉంది.

న్యాయవిద్యకు పెద్దపీట

బీఏ ఎల్ఎల్‌బీ ఐదేళ్ల కోర్సు పూర్తి చేసుకున్న వారు న్యాయమూర్తులయ్యారు. న్యాయ విద్యకు సమాజంలో ప్రాముఖ్యం పెరిగింది. విద్యార్థులకు ఉన్నత అవకాశాలు లభిస్తున్నాయి. అందువల్ల వర్సిటీలో న్యాయ విద్యకు పెద్ద పీట వేస్తున్నాం.

- శ్రీకాంత్ రెడ్డి, వీసీ, ఎస్వీయూనివర్సిటీ



రేపు దశమ వార్షికోత్సవం

సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు చంద్రచూడ్, దుర్గాప్రసాద్ రాక

బీఏ ఎల్ఎల్‌బీ కోర్సు దశమ వార్షికోత్సవం మంగళవారం జరగనుంది. రెండ్రోజులపాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇన్ లీగల్ ఎడ్యుకేషన్ అంశంపై వర్క్‌షాప్ ఉంటుంది. 28న సాంస్కృతిక కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి.
ఈ వార్షికోత్సవాల్లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధనుంజయ వై.చంద్రచూడ్, హైకోర్టు న్యాయమూర్తి దుర్గాప్రసాద్, సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు మహాలక్ష్మీ పావని, జేబీ గుప్తా తదితరులు హాజరు కానున్నారు. శ్రీనివాసా ఆడిటోరియంలో నిర్వహించే వర్క్‌షాప్‌ను సీజేఐ ప్రారంభించనున్నారు.

'రాజంపేట' లోక్‌సభ బీజేపీ అభ్యర్థిగా నల్లారి కిరణ్



రాయచోటి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాజంపేట లోక్‌సభకు కూటమి తరపున బీజేపీ అభ్యర్థిగా మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పోటీ చేయనున్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి ఆ పార్టీ విడుదల చేసిన జాబితాలో ఆయన పేరు ప్రకటించారు. దీంతో కొన్ని రోజులుగా ఈ స్థానం విషయమై జరుగుతున్న ఊహాగానాలకు ఊహాగానాలకు తెరపడింది. తొలుత రాజంపేట ఎంపీ సీటుకు టీడీపీ తరపున గంటా నరహరి.. ఆ తర్వాత మాజీ ఎమ్మెల్యే పాలకొండ్రాయుడు కుమారుడు సుగవాసి బాలసుబ్రమణ్యం పేర్లు తెరపైకి వచ్చాయి. అయితే టీడీపీ, జనసేన కూటమిలోకి బీజేపీ కూడా చేరింది. ఈ స్థానాన్ని బీజేపీ ఆశించడంతో.. మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపించింది. అయితే తెలుగుదేశం పార్టీ తొలుత బీజేపీకి ప్రకటించిన ఆరు పార్లమెంటు స్థానాలలో రాజంపేట లేదు. ఆ తర్వాత విజయనగరం బదులుగా రాజంపేట స్థానాన్నే బీజేపీ కోరుకుంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి విడుదల చేసిన అభ్యర్థుల జాబితాలో కిరణ్‌కుమార్‌రెడ్డి పేరుంది. కాగా, ఈయన సోదరుడు నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి తెలుగుదేశం పార్టీ తరపున పీలేరు అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

తండ్రి మరణానంతరం రాజకీయాల్లోకి..

మాజీ మంత్రి, తన తండ్రి అయిన నల్లారి అమరనాథరెడ్డి మరణానంతరం 1989లో వాయల్పాడు నుంచి కిరణ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా తొలిసారి పోటీచేసి విజయం సాధించారు. 1995లో కాంగ్రెస్ అభ్యర్థిగా ఓటమి.. 1999లో గెలుపు.. 2004లోనూ గెలుపొందారు. ప్రభుత్వ చీఫ్ విప్‌గా పనిచేశారు. నియోజకవర్గాల పునర్విభజనతో 2009లో పీలేరు ఎమ్మెల్యేగా గెలుపొంది స్పీకర్‌గా పనిచేశారు. వైఎస్ మరణానంతరం రోశయ్య తర్వాత ఉమ్మడి ఏపీ చివరి ముఖ్యమంత్రిగా 25.11.2010న కిరణ్ ప్రమాణ స్వీకారం చేశారు. విభజన చట్టానికి నిరసనగా 19.2.2014లో సీఎం పదవికి రాజీనామా చేసిన ఆయన.. 10.3.2014న జైసమైక్యాంధ్ర పార్టీ (జైఎస్‌పీ) స్థాపించారు. ఆ ఎన్నికల్లో ఒక్క చోటా గెలవకపోవడంతో రాజకీయాల నుంచి తాత్కాలికంగా నిష్క్రమించారు. 2018 జూలై 13న జేఎస్పీని రద్దు చేసి తిరిగి కాంగ్రెస్‌లో చేరిన ఆయన.. తర్వాత ఆపార్టీకి రాజీనామా చేసి గతేడాది ఏప్రిల్ ఏడో తేదీన బీజేపీలో చేరారు.

నేడు కుప్పానికి చంద్రబాబు రాక

కుప్పం, మార్చి 24: తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు.. సోమ, మంగళవారాల్లో సొంత నియోజకవర్గమైన కుప్పంలో పర్యటించనున్నారు.

నేటి పర్యటన షెడ్యూల్ ఇలా..

సోమవారం ఉదయం 11.25 గంటలకు: బెంగళూరు ఎయిర్ పోర్టునుంచి హెలికాప్టర్ ద్వారా పీఈఎస్ కళాశాల ఆస్పత్రి ఆవరణలోని హెలిప్యాడ్‌కు చేరుకుంటారు.

11.40: కుప్పం పట్టణం కొత్తపేటలో కన్యాకా పరమేశ్వరి ఆలయంలో పూజలు. **మధ్యాహ్నం 12 నుంచి 2వరకు:** టీడీపీ కార్యాలయంలో నాయకులతో సమావేశం. **3.20 నుంచి సాయంత్రం 5.30 వరకు:** కుప్పం ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్‌లో బహిరంగ సభ. **6-7 గంటల మధ్య:** కేవీఆర్ కల్యాణ మండపంలో ముస్లింల ఇఫ్తార్ విందుకు హాజరవుతారు. **7.30 నుంచి రాత్రి 8.30 వరకు:** టీడీపీ కార్యాలయంలో నేతలతో సమీక్ష. **8.45:** ఆర్అండ్‌బీ అతిథి గృహంలో రాత్రి బస

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సోమవారం) : సా. 6.27
సహరి (మంగళవారం) : ఉ. 4.54

కళాకారులకు మరణం లేదు

శ్రీవేంకటేశ్వర చిత్రార్చన పుస్తకావిష్కరణలో నటుడు బ్రహ్మానందం

తిరుపతి (కల్చరల్), మార్చి 24: కళాకారులకు మరణం లేదని ప్రముఖ సినీ హాస్య నటుడు బ్రహ్మానందం అన్నారు. అందుకే అమర శిల్పి జక్కన్నను ఇప్పటికీ స్మరించుకుంటామని చెప్పారు. 202 మంది చిత్రకారులు గీసిన బొమ్మలతో శ్రీకళాక్షేత్ర ఆర్టిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రూపొందించిన శ్రీవేంకటేశ్వర చిత్రార్చన పుస్తకాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. దీనికి తిరుపతిలోని టీటీడీకి చెందిన శ్రీవేంకటేశ్వర శిల్ప కళాశాల వేదికైంది. ఈ సందర్భంగా జరిగిన సభలో బ్రహ్మానందం మాట్లాడుతూ.. కళాకారుడు గడ్డి పూలలోనూ సౌందర్యాన్ని గుర్తించగలడన్నారు. బురదలోని పందిని నేరుగా చూడడానికి ఇష్టపడనివారు.. అదే బురదలో ఉన్న పంది చిత్రాన్ని చూసినపుడు ఆగి, ఆ బొమ్మలోని నైపుణ్యాన్ని ఆస్వాదిస్తారని అన్నారు. కళలోని సౌకుమార్యం ఇదేనన్నారు. అనంతరం ఈ పోటీకి శ్రీవారి చిత్రాన్ని పంపిన వారంలోనే మరణించిన చిత్రకారుడి కుటుంబానికి శ్రీకాళక్షేత్ర సంస్థ ద్వారా రూ.2.17 లక్షల ఆర్థిక సాయాన్ని అందించారు. కాగా, 202 కళాకారుల్లో సుమారు 30 మంది శిల్ప కళాశాలలో చదువుకున్న పూర్వ ప్రస్తుత విద్యార్థులు కావడం విశేషం. రూ.6లక్షలకుపైగా వ్యయంతో రూపొందించిన ఈ పుస్తకంలోని బొమ్మలతో ఏర్పాటు చేసిన ప్రదర్శన ఆకట్టుకుంది. కాలిగ్రఫీలో రాజేంద్ర.. బియ్యపు గింజపై రూపొందించిన శ్రీవారి బొమ్మ, బ్రహ్మానందం పెన్సిల్ షేడ్‌తో వేసిన వేంకటేశ్వరుడి చిత్రాన్ని పలువురు ఆసక్తిగా తిలకించారు. ఈ సభకు అధ్యక్షుడిగా ప్రముఖ కథా రచయిత ఆర్ఎం ఉమామహేశ్వరరావు వ్యవహరించారు. విశిష్ట అతిథులుగా టీటీడీ విద్యాశాఖ అధికారి ఎం.భాస్కరరెడ్డి, ఎస్వీయూ విశ్రాంత ఆచార్యుడు కిరణ్ క్రాంత్ చౌదరి, ప్రముఖ కవి డాక్టర్ కలువగుంట రామమూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ కె.వెంకటరెడ్డి, అధ్యాపకులు డాక్టర్ సాగర్ గిన్నె, బి.ఆనంద్, ఎ.రామచంద్రయ్య, చిత్రకారులు కె.మహేశ్వర్, దేవీశ్రీ ప్రసాద్, కిరణ్ కుమారి, సీనియర్ చిత్రకారులు సింగపల్లి సత్యనారాయణ, కళాభిమానులు, విద్యార్థులు, నగరవాసులు పాల్గొన్నారు.



బ్రహ్మానందానికి శ్రీవారి చిత్రపటాన్ని బహూకరిస్తున్న నిర్వాహకులు



ప్రదర్శనలో ఏర్పాటు చేసిన చిత్రాలు

మిగిలిన తుపాకుల మాటేమిటి?

తిరుపతి(నేరవిభాగం), మార్చి 24: సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో గన్ లైసెన్సులు పొంది ఉన్నవారు వెంటనే తుపాకులను పోలీసుల వద్ద డిపాజిట్ చేయాలని ఎన్నికల కమిషన్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. కలెక్టరేట్‌లో కలెక్టర్ సమక్షంలో జరిగిన సమావేశంలో ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా శనివారం వరకు లైసెన్సులు పొందిన 503 మందిలో 407 తుపాకులు ఆయా స్టేషన్లలో డిపాజిట్ చేశారని చెప్పారు. అయితే మిగిలిన 96 తుపాకుల సంగతేమిటన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. వీటిల్లో.. జిల్లాలో ఇప్పటికీ పేరుమోసిన స్మగ్లర్లు, కొంతమంది నాయకుల వద్ద గన్‌లు, పిస్టళ్లు అలాగే ఉన్నాయన్న ప్రచారం సాగుతోంది. ప్రధానంగా తిరుపతి కేంద్రంగా ఉంటూ నిన్నమొన్నటి వరకు వైసీపీతో అంటకాగి, ప్రస్తుతం తటస్థంగా ఉంటున్న నాయకుడు ఆత్మరక్షణ కోసం గన్ పెట్టుకున్నట్లు తెలుస్తోంది. అలాగే తిరుపతిలో కాపురముంటున్న ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పడమటి ప్రాంతానికి చెందిన ఒక స్మగ్లర్ వద్ద కూడా తుపాకీ ఉందని సమాచారం.

‘శ్రీవారి మెట్టు’లో పెరిగిన రద్దీ

● టైమ్ స్లాట్ టోకెన్లు సరిపోక ఇబ్బందిపడుతున్న భక్తులు



చంద్రగిరి, మార్చి 24: శ్రీవారి మెట్టు మార్గంలో భక్తుల రద్దీ పెరుగుతోంది. దానికి అనుగుణంగా టైమ్ స్లాట్ టోకెన్లు ఇవ్వక పోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. సోమవారం విశేష పౌర్ణమి కావడంతో ఆదివారం కూడా శ్రీవారిమెట్టు మార్గం కిటకిటలాడింది. గతంలో ఇక్కడ రోజుకు ఆరువేల టోకెన్లు ఇచ్చేవారు. వీటిని మూడువేలకు టీటీడీ కుదించింది. దీనివల్ల రద్దీ పెరిగిన సమాయల్లో భక్తులకు కష్టాలు తప్పడం లేదు.

రాజ్యాంగ పరిరక్షణ బీఎస్పీకే సాధ్యం



సమావేశంలో మాట్లాడుతున్న పుణ్యమూర్తి

చంద్రగిరి, మార్చి 24: భారత రాజ్యాంగాన్ని, సెక్యూలరిజాన్ని కాపాడుకోవాలంటే బహుజన సమాజ పార్టీ (బీఎస్పీ)కే సాధ్యమని అఖిల భారత అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతమాకుల పుణ్యమూర్తి అన్నారు. ఆదివారం చంద్రగిరిలోని ప్రైవేటు కల్యాణ మండపంలో జరిగిన బహుజనుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ప్రసంగించారు. రాజ్యాంగ అనుకూల శక్తులు, వ్యతిరేక శక్తుల మధ్యే ఎన్నికల పోరాటం జరుగుతోందన్నారు. దేశ భవిష్యత్తు ఎలా ఉండాలో వివరిస్తూ, గ్రామ గ్రామాన ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి ప్రభాకర్, బాదూరు ఎల్లయ్య, నాయకులు నాగరాజు, దినేష్, పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో క్షయవ్యాధి నివారణ

చంద్రగిరి, మార్చి 24: పౌష్టికాహారం తీసుకోవడంతో క్షయవ్యాధి నియంత్రించవచ్చని చంద్రగిరిలోని ఆదర్శ గ్రామీణ ఆరోగ్య పరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ ప్రసాద్ అన్నారు. ఆదివారం క్షయ నివారణ దినాన్ని పురస్కరించుకుని ఎంఆర్‌హెచ్ఆర్‌యూ, సీహెచ్‌సీ, ఆర్‌హెచ్‌టీఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది నారాయణ, సుబ్బలక్ష్మి, హౌస్ సర్జన్స్ సుచరిత, వేణుశ్రీ, తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మట్టలాదివారం



పాకాల, మార్చి 24: క్రైస్తవులు మట్టలాదివారాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం రైల్వేస్టేషన్ ఎదుట వున్న సీఎస్ఐ టౌన్ చర్చి వద్ద నుంచి వివిధ పుష్పాలతో అలంకరించిన మట్టలను చేత పట్టుకొని ఏసుక్రీస్తును స్తుతిస్తూ పురవీధులలో ప్రదర్శనగా రైల్వేగేటు సమీపంలోని సెయింట్ పాల్స్ సీఎస్ఐ చర్చికి చేరుకుని, ప్రార్థనలు చేశారు. అలాగే రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చిలోనూ వేడుకలు జరిగాయి. సెయింట్ పాల్స్ సీఎస్ఐ చర్చి పాస్టర్ ప్రేమ్‌కుమార్, కార్యదర్శి విక్టర్ రాఘవేల్, కోశాధికారి అరుళ్ సెల్వి, రోమన్ క్యాథలిక్ మిషన్ చర్చి ఫాదర్ ఆంథోని రాజ్ తదితరులు పాల్గొన్నారు.

చదరంగంలో సత్తాచాటిన అన్నాచెల్లెలు



బహుమతులతో మన్యశాయి, ధన్యశ్రీ

పాకాల, మార్చి 24: అనంతపురంలో ఆదివారం నిర్వహించిన స్టేట్ రాపిడ్ చెస్ టోర్నమెంట్‌లో చంద్రగిరికి చెందిన అన్నాచెల్లెలు కె.మన్యశాయి, కె.ధన్యశ్రీ సత్తాచాటారు. బాలుర విభాగంలో కె.మన్యశాయి, బాలికల విభాగంలో కె.ధన్యశ్రీ ప్రథమ స్థానం సాధించారు. వీరు దంత వైద్యులైన డాక్టర్ భువిందర్, డాక్టర్ స్వాతి పిల్లలు కావడంతో స్థానికులు అభినందించారు.

రాత్రి వేళల్లో ఎన్నికల స్క్వాడ్ తనిఖీలు



ఎర్రావారిపాలెం, మార్చి 24: ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు రాత్రి వేళల్లో చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాల్లో విస్తృతంగా తనిఖీలు చేపడుతున్నారు. ఆదివారం రాత్రి కూడా ఈ రెండు మండలాల్లో స్క్వాడ్ అధికారులు రంగారావు, మోహన్ రెడ్డి, శరణ్ కుమార్, రవికుమార్ తదితరులు తనిఖీ చేశారు.

వైభవంగా చండీ హోమం

రామచంద్రాపురం, మార్చి 24: రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వరాలయంలో వద్ద హోలీ సందర్భంగా ఆదివారం చండీహోమం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామి అమ్మవార్లకు తిరుమంజనం నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేపట్టారు. సాయంత్రం ఆరు గంటలకు కలశ పూజ జరిగింది. తర్వాత చండీహోమం శాస్త్రోక్తంగా ప్రారంభించి తొమ్మిది గంటలకు పూర్ణాహుతితో ముగించారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

చంద్రగిరిలో నాని గెలుపు తథ్యం : సైకం



నానీని పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న సైకం జయచంద్రారెడ్డి

తిరుపతి(రూరల్), మార్చి 24: రానున్న ఎన్నికల్లో పులివర్తి నాని గెలుపు ఖాయమని సివిల్ సప్లయీస్ రాష్ట్ర మాజీ చైర్మన్ సైకం జయచంద్రారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆదివారం నానీని మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఉమ్మడి పార్టీల నాయకులను సమన్వయపరిచి నాని విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని చెప్పారు. నాయకులు బుజ్జిరెడ్డి, మోహన్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ మీడియా కో-ఆర్డినేటర్‌గా శామ్యూల్



నాగలాపురం, మార్చి 24: కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా మీడియా కో ఆర్డినేటర్‌గా నాగలాపురానికి చెందిన శామ్యూల్‌కుమార్ నియమితుల య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేస్తానని తెలిపారు. తనకు ఈ పదవి అప్పగించిన ఏపీసీసీ ప్రెసిడెంట్ వైఎస్ షర్మిలకు, మీడియా సెల్ చైర్మన్ తులసిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎంపీటీసీకి పలువురి శుభాకాంక్షలు

తిరుచానూరు, మార్చి 24: బ్రాహ్మణపట్టు ఎంపీటీసీ యోగానందరెడ్డి జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి కార్యాలయంలో భారీ కేక్ కట్‌చేశారు. యోగానందరెడ్డికి రామచంద్రారెడ్డితోపాటు మాజీ సర్పంచులు గణపతి నాయుడు, సుబ్రహ్మణ్యంరెడ్డి, ఎంపీటీసీలు నరేష్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, వైసీపీ నేతలు హేమాద్రి, మునీంద్రరాయల్, చంద్రశేఖర్ ఆజాద్, లోకేష్‌రెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలియజేశారు.



ఎంపీటీసీ యోగానందరెడ్డికి కేక్ తినిపిస్తున్న సర్పంచ్ రామచంద్రారెడ్డి





తెప్పపై ఆశీనులై..

ఏడుసార్లు పుష్కరిణి చుట్టిన ఏడుకొండల స్వామి

తిరుమలలో ఐదు రోజుల పాటు జరిగిన వార్షిక తెప్పోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరిరోజు శ్రీదేవి, భూదేవి సమేతంగా ఏడుకొండల స్వామి పుష్కరిణిలో తెప్పపై ఆశీనులై ఏడుమార్లు విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ముందుగా స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు. అనంతరం పుష్కరిణిలో అప్పటికే సిద్ధంగా ఉంచిన తెప్పలో కొలువుదీర్చారు. విద్యుత్, పుష్పాలతో సౌందర్యవంతంగా తీర్చిదిద్దిన తెప్పపై ఉత్సమూర్తులను ఏడుమార్లు తిప్పారు. చల్లని వాతావరణంలో వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, అన్నమయ్య కీర్తనల నడుమ తెప్పోత్సవం వైభవంగా జరిగింది. ఆదివారం కావడంతో భక్తులు భారీ సంఖ్యలో ఉత్సవంలో పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

ఆదరించండి అభివృద్ధి చేస్తా : పులివర్తి నాని



నాని సమక్షంలో టీడీపీలో చేరిన వారు

రామచంద్రాపురం, మార్చి 24: ఎమ్మెల్యేగా తనకు అవకాశం ఇస్తే చంద్రగిరి నియోజకవర్గాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తానని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని అన్నారు. మండలంలోని అనుప్పల్లె పంచాయతీ నూతిగుంటపల్లెలో ఆదివారం టీడీపీ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాదయాత్రలో సీఎం జగన్ అనుప్పల్లె డీకేటీ భూములకు పట్టాలు ఇస్తానని హామీ ఇస్తే ఇప్పటివరకు చెవిరెడ్డి ఎందుకు చొరవ చూపలేదని ప్రశ్నించారు. నాలుగు పదవులు అడ్డుపెట్టుకుని వేలకోట్లు దోచుకున్నారే కానీ నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించలేదన్నారు. ఎన్నికలవేళ హడావుడిగా తిరుపతి నుంచి ఆర్‌సీపురం ఆర్అండ్‌బీ రోడ్డులో చేపట్టిన ప్యాచ్‌వర్కులు ఎన్నికల స్టంటేనన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అనుప్పల్లె - పనపాకం రోడ్డును అందుబాటులోకి తెస్తామన్నారు. అనంతరం అనుప్పల్లె, నూతిగుంట పల్లె గ్రామాల నుంచి వైసీపీ సీనియర్ నాయకులు తాటిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, మధు, మహేష్‌తోపాటు 50 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వీరికి నాని పసుపు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, జిల్లా నాయకులు చిన్నబాబు, జనార్ధన్‌చౌదరి, నరసింహారెడ్డి, హరిప్రసాద్, జేడీ జగన్, డిల్లీనథరరెడ్డి, మండల నాయకులు ప్రసాద్, సురేంద్రనాయుడు, గిరినాయుడు, మాబు, గుణసుందరి, సోమురాయల్, ప్రకాష్, చెంగల్‌రాయులు, మునిరత్నం రాయల్, సుబ్రమ్మణ్యంరెడ్డి, దొరస్వామిరెడ్డి పాల్గొన్నారు.

నృత్యం.. అమోఘం



తిరుచానూరు, మార్చి 24: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం రాత్రి తిరుపతికి చెందిన పుష్పం డ్యాన్స్ అకాడమీకి చెందిన కళాకారులు ప్రదర్శించిన భరతనాట్య ప్రదర్శన నగరవాసులను ఆకట్టుకుంది. కళాకారులు తన్మయ, కార్తీక, లోకిత, జశ్విత, దనుష్య, జాహ్నవి, జానవి, భవిష్య, షర్మిల, సహస్రలు శ్రీవిజ్ఞానందం, అడికొండడియార్, చంద్రచూడ, రామరామ, అమ్మ పరమేశ్వరి, వచ్చెను అలిమేలు తదితర కీర్తనలకు నృత్యం చేశారు. వీరిని శిల్పారామం ఏవో ఖాదరవల్లీ సన్మానించి జ్ఞాపికలు అందజేశారు.

పోలీసు బలగాల కవాతు



ఎర్రావారిపాలెం, మార్చి 24: ఎర్రావారిపాలెం మండలంలో ఆదివారం ప్రత్యేక పోలీసు బలగాల కవాతు నిర్వహించారు. ఎస్ఐ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్ బలగాలు ఎర్రావారిపాలెం, క్రాస్, నెరబైలు, బోడేవాండ్ల పల్లెల్లో కవాతు జరిపారు. ప్రతి ఓటరూ నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

షార్ట్ సర్క్యూట్‌తో మినీ లారీ దగ్ధం



తగలబడుతున్న వాహనం

తిరుచానూరు, మార్చి 24: షార్ట్ సర్క్యూట్ కారణంగా కొబ్బరిపీచు లోడుతో వెళుతున్న ఓ మినీ లారీ దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ముండ్లపూడి పెట్రోల్ బంక్ సమీపంలో ధరణి లేఅవుట్ వద్ద పరుపుల తయారీకి కొబ్బరి పీచును తయారు చేస్తారు. ఆదివారం రాత్రి డ్రైవర్ ప్రేమ్ తన మినీలారీలో కొబ్బరిపీచు లోడ్‌ను వేసుకుని ఫ్యాక్టరీ నుంచి వెలుపలకు వస్తుండగా విద్యుత్ వైర్లు తగిలాయి. దీంతో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. గమనించిన డ్రైవర్ చాకచక్యంగా వాహనాన్ని పరిశ్రమకు దూరంగా తీసుకెళ్లి ఆపేశాడు. దీంతో కొబ్బరి పీచు లోడుతోపాటు మినీ లారీ దగ్ధమైంది. మంటలు పరిశ్రమకు వ్యాపించలేదు. ముడిసరుకుకు ఎలాంటి నష్టం వాటిల్లలేదు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు.

తుంబురతీర్థానికి భారీగా తరలివచ్చిన భక్తజనం





తిరుమల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో సోమవారం జరుగనున్న తుంబురతీర్థ ముక్కోటికి భక్తజనం భారీగా తరలివచ్చారు. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం మధ్యాహ్నం వరకు ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి కావడంతో ఉదయం 5 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తులను తీర్థానికి అనుమతించారు. వాహనాల రద్దీని దృష్టిలో పెట్టుకుని గోగర్భం డ్యాం నుంచి పాపవినాశనం డ్యాం వరకు భక్తులను ఆర్టీసీ బస్సుల్లోనే తరలించారు. ఇతర వాహనాలను గోగర్భం డ్యాం వద్దనే ఆపేశారు. ఇక, భక్తులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా శ్రీవారి సేవకుల ద్వారా భక్తులకు అన్నప్రసాదం, నీళ్లు, మజ్జిగ పంపిణీ చేశారు. పటిష్ట భద్రత కల్పించారు. తీర్థానికి వెళ్లిన భక్తులు పుణ్యస్నానాలు ఆచరించారు. అక్కడున్న తుంబురనాదునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం ఉదయం 5 నుంచి 11 గంటల వరకు మరి కొంతమంది భక్తులను అనుమతించనున్నారు.

కోడ్ అమల్లోకి వచ్చినా వైసీపీ రంగులు తొలగించరా?



గూడూరు, మార్చి 24: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి 9 రోజులు గడుస్తున్నా వైసీపీకి చెందిన రంగులను అధికారులు తొలగించలేదు. స్థానిక జాతీయ రహదారి పోటుపాళెం కూడలి సమీపంలో చెన్నై, నెల్లూరు వైపు వెళ్లే ప్రయాణికులు వేచివుండేందుకు గతంలో ఎమ్మెల్యే వరప్రసాదరావు సొంతనిధులు బస్‌షెల్టర్లను ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఈ బస్ షెల్టర్లకు ముందు ముద్రించి వున్న దాత పేర్లకు పేపర్లు అతికించారు. అయితే బస్‌షెల్టర్‌లకు వున్న వైసీపీ రంగులను తొలగించలేదు.

వైసీపీ ప్రచారంలో వలంటీర్లు





నారాయణవనం, మార్చి 24: నారాయణవనంలో వైసీపీ నాయకులు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొన్నారు. శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డితో పాటు ఎంపీ గురుమూర్తి, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో పాలమంగళం సచివాలయానికి చెందిన వలంటీర్లు భానుప్రకాష్, బాషా, లోకేష్ పాల్గొన్నారు. వీరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని టీడీపీ నేత భాస్కరన్ చెప్పారు.

వెనామి రొయ్య పిల్లల్లో నాణ్యత డొల్ల

హేచరీల్లో నాసిరకం తల్లి రొయ్యల విక్రయం ● 3 నెలలకూ వంద కౌంట్ రాని వైనం ● తీవ్ర నష్టాల్లో ఆక్వా రైతులు





దిగుమతి అయిన రొయ్య పిల్లలు - కోట మండలం దొరువుకట్ట వద్ద సాగులో ఉన్న వెనామి రొయ్యలు

కోట, మార్చి 24: నాసిరకం వెనామి రొయ్య పిల్లలను విక్రయిస్తూ హేచరీల యజమానులు ఆక్వా రైతులను నిండా ముంచేస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 78 రొయ్యల హేచరీలు ఉన్నాయి. ఇందులో కోట, వాకాడు మండలాల్లో గోవిందపల్లి పాళెం, కొత్తపట్నం, తూపిలిపాళెం తదితర ప్రాంతాల్లో సుమారు 10 హేచరీలు ఉన్నాయి. వాటిల్లో గతంలో 40 పైసలు పలికిన వెనామి రొయ్యపిల్ల ధర ప్రస్తుతం 32 నుంచి 33 పైసలు పలుకుతోంది. పాండిచ్చేరి, చెన్నై ప్రాంతాల్లో 40 నుంచి 45 పైసలు పలికిన వెనామి రొయ్యపిల్లలు ప్రస్తుతం 35 పైసలు(ఒక రొయ్యపిల్ల) పలుకుతున్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పలు హేచరీలకు అమెరికా, మెక్సికో దేశాల నుంచి తల్లి రొయ్య పిల్లలు దిగుమతి అవుతుంటాయి. తల్లి రొయ్య పిల్ల 38 గ్రాములు, మగ రొయ్యపిల్ల 35 గ్రాముల సైజులో ఉంటాయి. నెల నుంచి రెండు నెలలలోపు ఒక తల్లి రొయ్యపిల్ల నుంచి లక్షల్లో గుడ్లు ఉత్పత్తి కాగా, 50 మిలియన్లలో రొయ్యపిల్లలు గుడ్ల నుంచి ఉత్పత్తి అవుతాయి. అయితే హేచరీల యజమానులు పోటీని దృష్టిలో ఉంచుకొని తల్లి రొయ్య నుంచి నెల రోజుల లోపు పిల్లలను రైతులకు సరఫరా చేస్తున్నారు. ఆ రొయ్యలను రైతులు తీసుకెళ్లి సాగుచేస్తే మూడు నెలలకు కూడా వంద కౌంట్ రాకపోవడం, పూర్తిగా రొయ్యల్లో ఎదుగుదల పడిపోతుండటంతో ఆక్వా రైతులు నిలువుదోపిడీకి గురై అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

ఐఐటీలో ముగిసిన హై-ఎండ్ వర్క్‌షాప్



వర్క్‌షాప్‌కు హాజరైన ప్రొఫెసర్లు, విద్యార్థులు

ఏర్పేడు, మార్చి 24: తిరుపతి ఐఐటీలో గత నెల 18న ప్రారంభమైన సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ సిమెంటీయస్ మెటీరియల్స్ లాబొరేటరీ టెస్టింగ్‌పై హై ఎండ్ వర్క్‌షాప్ ఆదివారంతో ముగిసింది. యాక్సిలేటర్ విజ్ఞాన్ పథకం కింద సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డు స్పాన్సర్ చేసి సిమెంటీఎస్ మెటీరియల్స్, లేబొరేటరీ టెస్టింగ్‌ల క్యారెక్టరైజేషన్‌పై ఈ వర్క్‌షాప్ విద్యార్థులకు ఎన్నో మెళకు వలను నేర్పింది. ఈ వర్క్‌షాప్‌లో వివిధ ఐఐటీల నుంచి ప్రొఫెసర్ల నేతృత్వంలో సాంకేతిక, ప్రయోగశాల సెషన్‌ల శ్రేణిని ప్రదర్శించారు. ఐఐటీ గాంధీనగర్ నుంచి డాక్టర్ శివతేజ ఆదివారం ఉదయం సిమెంటీయస్ మెటీరియల్స్‌పై చేసిన ప్రసంగం విద్యార్థులను ఆకట్టుకుంది. ఐఐటీ మద్రాస్ నుంచి ప్రఖ్యాత ప్రొఫెసర్ రవీందరగెట్టు ద్వారా సిమెంటియస్ సిస్టమ్ క్లోజ్డ్ -లూప్ టెస్టింగ్‌పై మధ్యాహ్నం సెషన్ జరిగింది. ఈ కార్యకరమంలో ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎస్ సత్యనారాయణ, పాల్గొన్నారు.

కలెక్టర్ ఉత్తర్వులు బేఖాతర్

● ఏర్పేడులో పంచాయతీ కార్యదర్శుల మార్పిడి ● ఆందోళనలో కార్యదర్శులు

ఏర్పేడు, మార్చి 24: ఏర్పేడు ఎంపీడీవో గిడ్డయ్య వైసీపీ నాయకుల సూచనల మేరకు కలెక్టర్ ఉత్తర్వులను బేఖాతర్ చేస్తూ పంచాయతీ కార్యదర్శులను వేరే పంచాయతీకి మార్పులు చేస్తున్నారు. దీంతో మండలంలో పనిచేసే పంచాయతీ కార్యదర్శులు ఆందోళన చె oదుతున్నారు. పెనగడం పంచాయతీ కార్యదర్శిగా అశోక్‌ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఆయనను పెనగడంలో పనిచేయించకుండా రావిళ్లవారికండ్రిగకు వైసీపీ నాయకులు అండదండలతో డెవలప్‌మెంట్ గ్రౌండ్ కింద బదిలీ చేశారు. రావిళ్లవారికండ్రిగ పంచాయతీలో పనిచేసే యమున అనే కార్యదర్శిని పెనగడానికి బదిలీ చేశారు. కోబాక పంచాయతీ కార్యదర్శి లోకముని అక్కడ ఓ ఎంపీటీసీకి నచ్చకపోవడంతో ఆయనను ఎండీపుత్తూరుకు బదిలీ చేశారు. పల్లం పంచాయతీలో పనిచేస్తున్న కార్యదర్శి సుధాకర్ స్థానిక వైసీపీ నాయకులకు నచ్చకపోవడంతో ఆయనను వికృతమాల పంచాయతీకి బదిలీచేశారు. వికృతమాలలో పనిచేస్తున్న రోశయ్యను పల్లం పంచాయతీకి పంపించారు. ఇలా మండలంలో సుమారు పది పంచాయతీలకు కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం అధికారులు పనిచేయడంలేదు.

అక్క హత్య.. మనస్తాపంతో తమ్ముడి ఆత్మహత్య



బాలమురగయ్య (ఫైల్ ఫొటో)

వరదయ్యపాళెం, మార్చి 24: అక్క హత్యకు గురికావడంతో తమ్ముడు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వరదయ్య పాళెంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రతాప్ కథనం మేరకు.. బీఎన్‌కండ్రిగ మండలం కంచన పుత్తూరుకు చెందిన ప్రత్యేక ప్రతిభావంతుడు బాలమురగయ్య (26) ఇందిరానగర్ పంచాయితీ పద్మావతి పురంలో కాపురం ఉంటున్నాడు. వరదయ్య పాళెం స్టేట్‌బ్యాంకు ఎదరుగా నెట్‌కేంద్రాన్ని నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ఆయన అక్క హత్యకు గురైంది. నాటి నుంచి మనస్తాపానికి గురై శనివారం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకు న్నాడు. స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మడుగులో పడి బాలుడి మృతి

కోట, మార్చి 24: మడుగులో పడి బాలుడు మృతి చెందిన ఘటన కోట మండలం నెల్లూరుపల్లి కొత్త పాళెం పంచాయతీ పరిధిలో గల విశ్వనాథపుర అగ్రహారంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు... విశ్వనాథపుర అగ్రహారం దళితవాడకు చెందిన పాకం మణెయ్య - రమణమ్మ దంపతుల కుమారుడు జశ్వంత్(17) ఇటీవల పదో తరగతి పరీక్షలు రాశాడు. ఆదివారం తల్లి రమణమ్మతో కలసి గ్రామానికి దూరంలో ఉన్న ఓ మడుగులో బట్టలు ఉతికేందుకు వెళ్లారు. తల్లి బట్టలు ఉతుకుతుండగా జశ్వంత్ చేపలు పట్టేందుకు మడుగులో దిగాడు. లోతులోకి వెళ్లడంతో నీటి మునిగిపోయి ఈత రాక కేకలు వేశాడు. రమణమ్మ కేకలు వేయడంతో చుట్టుపక్కల పశువుల కాపర్లు జశ్వంత్ బయటకు తీసి కోట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందిన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

ఒక్క అడుగూ ముందుకు పడలేదు

పునాదులకే పరిమితమైన బీసీ భవన్ ● ఇదీ బీసీల పట్ల వైసీపీ పాలకుల చిత్తశుద్ధి

తిరుపతి (జీవకోన), మార్చి 24: తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల పరిధిలోని బీసీలకు ఉపయోగకరంగా ఉండేందుకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం బీసీ భవన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. తిరుపతి అర్బన్ మండలం శెట్టిపల్లి పంచాయతీ సమీపంలోని మంగళం-శెట్టిపల్లి ప్రధాన మార్గంలో సర్వే నెంబర్ 117/2లో మూడు ఎకరాల స్థలాన్ని కేటాయించింది. భవన నిర్మాణానికి రూ199.90లక్షల నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పనులను పర్యవేక్షించే బాధ్యతను తుడాకు అప్పగించింది. తుడా పాలకవర్గం వెనువెంటనే పనులకు శ్రీకారం చుట్టింది. భూమి చదును, పునాదుల తవ్వకం, పిల్లర్ల ఏర్పాటు పనులు చకచకసాగాయి. అయితే 2019లో ఎన్నికలు జరగడం, వైసీపీ అధికారంలోకి రావడంతో పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. నిత్యం బీసీల జపం చేసే పాలకులు ఆ సామాజిక వర్గం సౌకర్యం కోసం నిర్మించతలపెట్టిన భవన నిర్మాణాన్ని పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం ఆ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలంలో దట్టమైన ముళ్ల పొదలు దర్శనమిస్తున్నాయి.


పనులను పరిశీలిస్తున్న అప్పటి తుడా చైర్మన్ నరసింహయాదవ్ - బీసీ భవన్‌కు కేటాయించిన స్థలంలో ముళ్లపొదలు

డ్రగ్స్ కుంభకోణాన్ని టీడీపీకి ఆపాదించే కుట్ర

టీడీపీ నేత నరసింహ యాదవ్


మీడియాతో మాట్లాడుతున్న నరసింహయాదవ్

తిరుపతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : డ్రగ్స్ కుంభకోణంలో వైసీపీ నేతలు అడ్డంగా దొరికిపోయినప్పటికీ దాన్ని తెలుగుదేశం పార్టీకి ఆపాదించే కుట్ర చేస్తున్నారని ఆ పార్టీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ మండిపడ్డారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో వివేకా హత్య, కోడికత్తి కేసులను టీడీపీపైకి నెట్టే ప్రయత్నం చేశారన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక జరిగిన డ్రగ్స్ కేసునూ టీడీపీకి అంటగడుతున్నారన్నారు. విశాఖను రాజధానిగా మారుస్తానని చెప్పి డ్రగ్ క్యాపిటల్‌గా మార్చారని ఆరోపించారు. వీరభద్రరావు సోదరుడు కూనం పూర్ణచంద్రరావుకు, విజయసాయి రెడ్డికి సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. డ్రగ్స్ కంటైనర్‌లో మార్ఫిన్, కొకైన్, హెరాయిన్, యాంఫెటమిన్, మెస్కిలన్ వంటి మత్తు పదార్థాలు ఉన్నట్లు సీబీఐ నివేదికలో పేర్కొందని గుర్తుచేశారు. గతంలో విజయవాడలోని ఆశి ట్రేడర్స్ పేరుతో ముంద్రా పోర్టులో రూ.21వేల కోట్ల విలువైన హెరాయిన్ దిగుమతిలో కాకినాడ ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి కీలకంగా వ్యవహరించారని ఆరోపించారు. ఇప్పుడు ఏకంగా రూ.50వేల కోట్ల విలువైన 25 వేల కిలోల డ్రగ్స్ ఉన్నాయని తేలిందన్నారు. డ్రగ్స్ సీజ్ చేయడానికి వెళ్లిన సమయంలో స్థానిక పోలీసులు తీవ్రంగా ప్రతిఘటించారని సీబీఐ అధికారులు తమ ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారని, తాడేపల్లి ప్రమేయం లేకుండానే సీబీఐ అధికారులను పోలీసులు అడ్డుకోగలరా? అని ప్రశ్నించారు. ఈ కుంభకోణం వెనుక తాడేపల్లి ప్యాలెస్ హస్తం ఉందని ఆరోపించారు. గతంలో నిమ్మగడ్డ ప్రసాద్, కోనేరు ప్రసాద్ లాంటి వారితో వైసీపీ చేయించిన అక్రమాలు అందరికీ తెలిసినవేనన్నారు. ఈ సమావేశంలో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, తిరుపతి క్లస్టర్ ఇన్‌చార్జి బిజి కృష్ణ యాదవ్, యశ్వంత్ రెడ్డి, చేజర్ల మనోహర్ ఆచారి పాల్గొన్నారు.

క్షయ నివారణ దినోత్సవ ర్యాలీ


ర్యాలీలో వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది

తిరుపతి (వైద్యం), మార్చి 24: ప్రపంచ క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా రెవెన్యూ అధికారి పెంచలకిషోర్ ర్యాలీని ప్రారంభించారు. టీబీ అంతం మనందరి పంతం, టీబీ అంటే భయం వద్దు చికిత్సే ముద్దు అంటూ నినదించారు. వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ శ్రీహరి, డీఎల్ఏటీవో డాక్టర్ అరుణసులోచన పలువురు క్షయరోగులకు పోషకాహార కిట్లను పంపిణీ చేశారు. డాక్టర్ రాజా క్షయ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రుయా ఆస్పత్రి పల్మనాలజీ విభాగాధిపతి డాక్టర్ సుబ్బారావు, ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ డాక్టర్ రవిప్రభు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండంతా అరుణాచలేశ్వరుడి భక్తులే


బస్టాండులో తిరువణ్ణామలై ప్రయాణికుల రద్దీ

తిరుపతి(ఆర్టీసీ), మార్చి 24: పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం తమిళనాడు తిరువణ్ణామలై అరుణాచలేశ్వరుడి ఆలయానికి వెళ్లే భక్తులతో తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నిండిపోయింది. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం 10గంటల వరకు పౌర్ణమి గడియలు ఉండడంతో భక్తులు పోటెత్తారు. 153 ప్రత్యేక బస్సులను కేటాయించినా సరిపోలేదు. సాయంత్రం వరకు రద్దీ కొనసాగింది. సీట్లు లభించక చాలామంది నిలబడివెళ్లారు. తిరుమల తుంబురుతీర్థ ముక్కోటి ఉండడంతో అంతకంటే ఎక్కువ బస్సులు కేటాయించడానికి వీలుపడలేదని ఆర్టీసీ అధికారులు తెలిపారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో కొంతమేర ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు.

అ'పూర్వ' కలయిక.!



తిరుపతి (విద్య), మార్చి 24: కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌కు చెందిన పూర్వ విద్యార్థుల (అలుమ్నిమీట్-2కె24) సమావేశం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆ కళాశాలలో 1957నుంచి చదివి వివిధ హోదాల్లో స్థిరపడిన పలువురు ఒకచోట చేరి ఆప్యాయంగా పలకరించుకుని మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థి, రిటైర్డ్ ప్రిన్సిపాల్ శివరామన్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పలువురు పూర్వ విద్యార్థులు తమవంతు సహాయ, సహకారాలు అందించారని తెలిపారు. మరో రిటైర్డ్ ప్రిన్సిపాల్ వి.ప్రభాకరన్ మాట్లాడుతూ కళాశాలలో ఐదు బ్రాంచ్‌లకు ఎన్‌బీఏ గుర్తింపు దక్కడం సంతోషంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వై.ద్వారకనాథరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో జనరల్ విభాగం హెడ్ డాక్టర్ ఎస్వీగౌరీశంకర్, కెమికల్ ఇంజినీరింగ్ హెడ్ ఆర్వీ రమణకుమార్ పాల్గొన్నారు.

'సూర్య' ప్రతాపం

పెరుగుతున్న ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి

పగటి ఉష్ణోగ్రత 39.9డిగ్రీలు






ఎండతాకిడి లేకుండా స్కార్ఫ్‌లు చుట్టుకున్న వాహనదారులు

తిరుపతి అర్బన్, మార్చి 24 : నగరంలో ఆదివారం సూర్య ప్రతాపం ఎక్కువగా కనిపించింది. ఉదయం నుంచి ఎండ తాకిడి పెరిగింది. మధ్యాహ్నం భానుడు భగభగమని మండడంతో ప్రజలు అల్లాడిపోయారు. పగటి ఉష్ణోగ్రత 39.9డిగ్రీలు, అత్యల్పంగా 24.3డిగ్రీలుగా నమోదైంది. పాదచారులు, మార్కెట్ వ్యాపారులు గొడుగులను ఆశ్రయించడం కనిపించింది. వాహనదారులు ముఖాలకు, తలకు దుస్తులు కప్పుకున్నారు. మధ్యాహ్నం నగరంలోని ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా కనిపించాయి. ఆర్టీసీ బస్టాండు, గాంధీరోడ్డు, తిలక్ రోడ్డు, తిరుమల బైపాస్‌రోడ్డు, శ్రీనివాససేతు, ఎయిర్‌బైపాస్‌రోడ్డు జన సంచారం లేక బోసిపోయాయి. బస్టాండు, రైల్వేస్టేషన్ వద్ద ప్రయాణికులు, పిల్లలు, వృద్ధులు దాహానికి చలివేంద్రాలు, శీతల పానీయాలను ఆశ్రయించారు. రాత్రిపూట ఉక్కపోత పెరిగింది. వేసవి ప్రారంభంలోనే 40 డిగ్రీలకు చేరువైన ఉష్ణోగ్రతలు ఏప్రిల్, మేలో ఎలా ఉంటాయోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.


మార్కెట్లో గొడుగుల పంచన చేరిన వ్యాపారులు

టీడీపీ ముస్లిం మైనారిటీ సెల్ సభ్యులకు నియామక పత్రాల పంపిణీ



తిరుపతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ అనుబంధ ముస్లిం మైనారిటీ సెల్ సభ్యులకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి సుగుణమ్మ ఆదివారం ఆమె నివాసంలో నియామక పత్రాలను అందజేశారు. నగర అధ్యక్ష, కార్యదర్శులుగా మహ్మద్‌రఫీ, బాషా, కమిటీ సభ్యులు జుబేదా, హరన్‌బాషా, నసీరుద్దీన్, జుబేదా, మల్లికమ్మ తదితరులకు నియామక పత్రాలు అందజేశారు. మైనారిటీ సెల్ స్టేట్ సెక్రటరీ మెహబూబ్ బాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాయకులు ఆర్సీ మునికృష్ణ, దంపూరి భాస్కర్ యాదవ్, చినబాబు, బుల్లెట్ రమణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.79 కోట్లు

తిరుమల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.79 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 72,986 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 33,482 మంది తలనీలాలు సమర్పించారు.

ప్రశాంత వాతావరణంలో ఓటు వేయండి

తిరుపతి(నేరవిభాగం), మార్చి 24: ఎన్నికల రోజున ఓటర్లు తమ ఓటు హక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకోవాలని ఎమ్మార్‌పల్లి సీఐ అహ్మద్ విజ్ఞప్తి చేశారు. తిరుపతి రూరల్ పరిధిలోని తుమ్మలగుంట, చిగురువాడ, మల్లంగుంట, పుదిపట్ల, సి.మల్లవరం ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలను ఆదివారం సాయంత్రం ఆయన తనిఖీ చేశారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవగాహన కల్పించారు. ఎక్కడా అల్లర్లకు తావులేకుండా ఓటు వేసుకోవాలని సూచించారు. ఓటును అమ్ముకోవద్దని కోరారు.

ఫార్మా సేల్స్ ఎగ్జిక్యూటివ్స్‌ను 1976 యాక్ట్‌లో చేర్చాలి

తిరుపతి(వైద్యం), మార్చి24 : ఫార్మా సేల్స్ ఎగ్జిక్యూటివ్స్‌ను ఎస్‌పీఈ యాక్ట్ 1976లో చేర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విన్నవించాలని ఏపీ ఫార్మా సేల్స్ ఎగ్జిక్యూటివ్ అసోసియేషన్ తీర్మానించింది. తిరుపతిలోని యూత్ హాస్టల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన అసోసియేషన్ వార్షిక సర్వసభ్య సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.ఉమామహేశ్వరరావు, కోశాధికారి బీ గురుప్రసాద్, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అనంతరం 2024 ఏడాదికి గాను తిరుపతి శాఖ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా కే నరేష్, ఉపాధ్యక్షుడిగా సీ వివేకానంద, కార్యదర్శిగా ఎస్ఆర్ కులశేఖర్, సంయుక్త కార్యదర్శిగా వేంకటేష్, కోశాధికారిగా జే జయకృష్ణను ఎన్నుకున్నారు.

గీజర్లు కొత్తవే.. కానీ పనిచేయవు

గదుల్లో వేడినీళ్లు రాక యాత్రికుల అవస్థలు



ఖాళీగా దర్శనమిస్తున్న వేడినీటి కేంద్రం

తిరుమల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం గదుల్లో ఏర్పాటు చేసిన నూతన గీజర్లు పనిచేయడం లేదు. వేడి నీటి సదుపాయం లేక భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా తిరుమలలో వాతావరణం చల్లగా ఉంటుంది. స్వామి దర్శనార్థం వచ్చే భక్తులు తలనీలాల సమర్పణ అనంతరం, దర్శనానికి వెళ్లే ముందు స్నానాలు చేసేందుకు వేడినీళ్లను కోరుకుంటారు. వీఐపీ రూముల్లో వేడినీటి సదుపాయానికి ఎలాంటి కొదవా ఉండదు. రూ.వంద నుంచి రూ.వెయ్యి లోపు అద్దె కలిగిన గదుల్లో ఈ సదుపాయం ఉండదు. వేడినీళ్లు కావాలంటే కాటేజీల వద్ద రోడ్డుపక్కన ఉండే కేంద్రాలకెళ్లి బకెట్ల ద్వారా తెచ్చుకోవాల్సి ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో ఈ కేంద్రాల్లోనూ వేడినీళ్లు సరిగా రావడం లేదు. ఈక్రమంలోనే సామాన్య భక్తులు బసచేసే అద్దె గదుల్లోనూ గీజర్లను ఏర్పాటు చేయాలని టీటీడీ నిర్ణయించింది. ఇప్పటికే గీజర్లను అమర్చినా కనెక్షన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. ఏఎన్సీ, జీఎన్సీ, హెచ్‌వీసీ వంటి ప్రాంతాల్లో కొన్ని గీజర్లకు పవర్ కనెక్షన్లు ఇచ్చి మిగిలిన వాటిని అలానే వదిలేశారు. ఇదే విషయమై ఇటీవల ఓ భక్తుడు డయల్ యువర్ ఈవో కార్యక్రమానికి ఫోన్ చేసి ఈవోకు ఫిర్యాదు చేశాడు. అయితే గీజర్లకు సరిపడ పవర్ లోడ్ సరఫరా లేకపోవడం వల్లే ఈ పరిస్థితి వచ్చిందని అధికారులు అంటున్నారు. ఉన్నతాధికారులు దీనిపై దృష్టిం సారించాల్సి ఉంది.

జాస్మిన్ వృద్ధాశ్రమం ప్రారంభం

తిరుపతి అర్బన్, మార్చి 24: బైరాగిపట్టెడలో జాస్మిన్ వృద్ధాశ్రమాన్ని టీటీడీ విశ్రాంత ఉద్యోగి, గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, కస్తూర్బా కేంద్ర ట్రస్టు చైర్మన్ డాక్టర్ పి.సి.రాయలు ఆదివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ సమాజంలో ఎంతో మంది వృద్ధులు నిరాదరణకు గురై ఇబ్బంది పడుతున్నారని, అలాంటి వారిని ఆశ్రమం కల్పించాలని అన్నారు. నిర్వాహకులు ఆర్.సునీల్‌బాబు, షేక్ షాబుద్దీన్ మాట్లాడుతూ రోజూ 100మంది పేదలకు, వృద్ధులకు అన్నదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ విశ్రాంత ఉద్యోగి నాగరాజు, భాస్కర్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంరెడ్డి, శంకర్, బండి మధుసూదన్‌రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు, శివారెడ్డి, కల్పన, బంగారుబాబు, రఘురామిరెడ్డి, నాజరాజునాయుడు, బుజ్జి, సిద్దారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఆశ్రమాన్ని ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

డీఎస్సీని వాయిదా వేయాలి

తిరుపతి(విద్య), మార్చి 24: ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పాఠశాల విద్యాశాఖ తలపెట్టిన డీఎస్సీని వాయిదా వేయాలని ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జగన్నాథం కోరారు. బైరాగిపట్టెడలోని సంఘ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇప్పటివరకు టెట్ ఫలితాలు విడుదల చేయలేదని, పరీక్ష కేంద్రాల ఎంపికకు, ఐచ్ఛికాల నమోదుకు వెబ్‌సైట్‌లో అవకాశం కల్పించలేదని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్ర తరహాలో మెగా డీఎస్సీ నిర్వహణకు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయవాణి సంపాదకులు గాజుల నాగేశ్వరరావు, నాయకులు కె.ధనంజయ నాయుడు, కె.మోహన్, దేవేంద్ర, రామాంజనేయులు, రేణుకాదేవి, ద్రాక్షాయణి, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యంకు అవార్డుపై హర్షం


సుబ్రహ్మణ్యంను సన్మానిస్తున్న వాయిద్య కళాకారుల సంఘం ప్రతినిధులు

తిరుపతి అర్బన్, మార్చి 24: ప్రముఖ వాయిద్య కళాకారుడు వి.సుబ్రహ్మణ్యం సంగీత నాటక అకాడమీ అవార్డు అందుకోవడం పట్ల వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం హర్షం వ్యక్తం చేశారు. ఈనెల 6న ఆయన భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. ఆదివారం యూత్ హాస్టల్లో వాయిద్య కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయనను సన్మానించారు. వి.సత్యనారాయణ, మునిరత్నం, గోవిందశెట్టి, ఎస్.మునిరత్నం, బాలచందర్, ఆర్.కృష్ణారావు, రావిపాటి సత్యనారాయణ, ఎ.మునస్వామి, ఎస్.కృష్ణమూర్తి, రామచంద్రయ్య, ఎర్రయ్య, వాయిద్య కళాకారులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో రద్దీ



తిరుపతి సెంట్రల్, మార్చి 24: తిరుపతి రైల్వేస్టేషన్‌లో ఆదివారం ప్రయాణికుల రద్దీ ఎక్కువగా కనిపించింది. తెలుగు రాష్ట్రాల్లో ఇంటర్మీడియట్ పరీక్షలు పూర్తికావడం, వారాంతం, వరుస సెలవులు కలసి రావడంతో శ్రీవారి దర్శనార్థం పెద్ద సంఖ్యలో జనం తరలివచ్చారు. తిరుపతి నుంచి హైదరాబాదు, సికింద్రాబాదు, వైజాగ్, కాకినాడ, చెన్నై, బెంగళూరు, విజయవాడ, కోయంబత్తూరు, రామేశ్వరం, హౌరా రైళ్లలో టిక్కెట్స్ రిజర్వేషన్ ఖరారు కాకపోవడంతో కొందరు సాధారణ టిక్కెట్స్‌తో వెళ్లారు. మరికొందరు బస్సులను ఆశ్రయించారు. మంగళవారం మాత్రమే ఎక్కువ సంఖ్యలో ప్రత్యేక రైళ్లను నడపడం కంటే వారాంతంలోనూ ఏర్పాట్లు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

టీడీపీ గెలుపు కోసం సమష్టి కృషి: నెలవల


సమావేశంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం

నాయుడుపేట టౌన్, మార్చి 24: టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ విజయశ్రీ గెలుపు కోసం అందరూ సమష్టిగా కృషి చేయాలని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. ఆదివారం నాయుడుపేట పట్టణం శ్రీకాళహస్తి బైపాస్ రోడ్డు సమీపంలోని శ్రీనివాస ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని ముఖ్య టీడీపీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంపై కార్యచరణ ప్రణాళిక రూపొందించారు. అనంతరం నెలవల మాట్లాడుతూ టీడీపీలో అన్ని వర్గాలకు సముచితస్థానం ఉంటుందన్నారు. వైద్య వృత్తిని వదిలి ప్రజాసేవ కోసం వచ్చిన తన కుమార్తె విజయశ్రీ గెలుపు కోసం అందరూ కృషి చేయాలని కోరారు. వైసీపీ పాలనతో రాష్ట్రంలో అభివృద్ధి కుంటుపడిందని, మళ్లీ అభివృద్ధి జరగాలంటే చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శిరసనం బేటి విజయభాస్కర్‌రెడ్డి, కందల కృష్ణారెడ్డి, రఫీ, పసల గంగాప్రసాద్, వేమసాని శోభన్‌నాయుడు, నాగేంద్రరెడ్డి, శ్రీరామ్ ప్రసాద్, విజయకుమార్ నాయుడు, కిష్టయ్య, జీవీఆర్ నాయుడు, అవధానం సుధీర్, నానాబాల సుబ్బారావు, బాబు, బిరదవాడ నారాయణ, మల్లాం రవి, మధునాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లస్టర్ ఇన్‌చార్జిలు కీలకంగా వ్యవహరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న పాశిం సునీల్‌కుమార్

కోట, మార్చి 24: త్వరలో జరగబోవు ఎన్నికల్లో క్లస్టర్ ఇన్‌చార్జిలు కీలకంగా వ్యవహరించాలని గూడూరు టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పాశిం సునీల్‌కుమార్ అన్నారు. కోటలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం క్లస్టర్ ఇన్‌చార్జిల సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ వైఫల్యాలను ప్రతి గడపకూ తీసుకువెళ్లి టీడీపీ గెలుపుక కోసం సైనికుల్లా పనిచేయాలన్నారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు సర్వోత్తమరెడ్డి, మైనార్టీ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్ పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా పరికరాలు


విద్యార్థులకు క్రీడా పరికరాలను అందజేస్తున్న జీఎం కృష్ణన్

కోట, మార్చ 24: స్థానిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు మండల పరిధిలోని చిట్టేడు జీవీఆర్ రొయ్యల పరిశ్రమ యాజమాన్యం రూ.35వేల విలువ చేసే క్రీడా పరికరాలను అందజేసింది. పరిశ్రమ వ్యవస్థాపకుడు గ్రంధి వెంకటేశ్వరరావు జయంతిని పురస్కరించుకొని ఆయన కుమారులు శ్రీనివాసరావు, బాలాజీ, చల్లరావు దాతృత్వంతో పరిశ్రమ జీఎం కృష్ణన్ చేతుల మీదుగా క్రీడా పరికరాలను విద్యార్థులకు అందజేశారు. హెచ్ఎం నిర్మలాదేవి, పీఈటీ కృష్ణ, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే పరిశ్రమ ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు.

క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

చిల్లకూరు, మార్చి 24: ప్రపంచ క్షయవ్యాధి దినోత్సవం సందర్భంగా ఆదివారం చిల్లకూరులో స్థానిక పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది క్షయవ్యాధి నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తేజస్విని మాట్లాడుతూ దగ్గు ఎక్కువగా ఉన్నప్పుడు సమీప ఆస్పత్రుల్లో గళ్ల పరీక్ష చేయించుకుని నిర్ధారించుకోవాలని సూచించారు. క్షయవ్యాధిని ప్రాథమిక దశలోని గుర్తించడం ద్వారా సులభంగా నయం చేసుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో రవికుమార్, సురేంద్రరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

మడుగులో పడి బాలుడి మృతి

కోట, మార్చి 24: మడుగులో పడి బాలుడు మృతి చెందిన ఘటన కోట మండలం నెల్లూరుపల్లి కొత్తపాళెం పంచాయతీ పరిధిలో గల విశ్వనాథపుర అగ్రహారంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు... విశ్వనాథపుర అగ్రహారం దళితవాడకు చెందిన పాకం మణెయ్య - రమణమ్మ దంపతుల కుమారుడు జశ్వంత్(17) ఇటీవల పదో తరగతి పరీక్షలు రాశాడు. ఆదివారం తల్లి రమణమ్మతో కలసి గ్రామానికి దూరంలో ఉన్న ఓ మడుగులో బట్టలు ఉతికేందుకు వెళ్లారు. తల్లి బట్టలు ఉతుకుతుండగా జశ్వంత్ చేపలు పట్టేందుకు మడుగులో దిగాడు. లోతులోకి వెళ్లడంతో నీటి మునిగిపోయి ఈత రాక కేకలు వేశాడు. రమణమ్మ కేకలు వేయడంతో చుట్టుపక్కల పశువుల కాపర్లు జశ్వంత్ బయటకు తీసి కోట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందిన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేదు.

మోడల్ స్కూల్‌లో ఇంటర్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

వెంకటగిరిటౌన్, మార్చి 24: ఏపీ మోడల్ స్కూల్‌లో 2024-25 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఏపీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ తులసీజ్యోతి తెలిపారు.

వెనామి రొయ్యి పిల్లల్లో నాణ్యత డొల్ల

హేచరీల్లో నాసిరకం తల్లి రొయ్యల విక్రయం ● 3 నెలలకూ వంద కౌంట్ రాని వైనం ● తీవ్ర నష్టాల్లో ఆక్వా రైతులు



దిగుమతి అయిన రొయ్య పిల్లలు - కోట మండలం దొరువుకట్ట వద్ద సాగులో ఉన్న వెనామి రొయ్యలు

కోట, మార్చి 24: నాసిరకం వెనామి రొయ్య పిల్లలను విక్రయిస్తూ హేచరీల యజమానులు ఆక్వా రైతులను నిండా ముంచేస్తున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో 78 రొయ్యల హేచరీలు ఉన్నాయి. ఇందులో కోట, వాకాడు మండలాల్లో గోవిందపల్లి పాళెం, కొత్తపట్నం, తూపిలిపాళెం తదితర ప్రాంతాల్లో సుమారు 10 హేచరీలు ఉన్నాయి. వాటిల్లో గతంలో 40 పైసలు పలికిన వెనామి రొయ్యపిల్ల ధర ప్రస్తుతం 32 నుంచి 33 పైసలు పలుకుతోంది. పాండిచ్చేరి, చెన్నై ప్రాంతాల్లో 40 నుంచి 45 పైసలు పలికిన వెనామి రొయ్యపిల్లలు ప్రస్తుతం 35 పైసలు(ఒక రొయ్యపిల్ల) పలుకుతున్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని పలు హేచరీలకు అమెరికా, మెక్సికో దేశాల నుంచి తల్లి రొయ్య పిల్లలు దిగుమతి అవుతుంటాయి. తల్లి రొయ్య పిల్ల 38 గ్రాములు, మగ రొయ్యపిల్ల 35 గ్రాముల సైజులో ఉంటాయి. నెల నుంచి రెండు నెలలలోపు ఒక తల్లి రొయ్యపిల్ల నుంచి లక్షల్లో గుడ్లు ఉత్పత్తి కాగా, 50 మిలియన్లలో రొయ్యపిల్లలు గుడ్ల నుంచి ఉత్పత్తి అవుతాయి. అయితే హేచరీల యజమానులు పోటీని దృష్టిలో ఉంచుకొని తల్లి రొయ్య నుంచి నెల రోజుల లోపు పిల్లలను రైతులకు సరఫరా చేస్తున్నారు. ఆ రొయ్యలను రైతులు తీసుకెళ్లి సాగుచేస్తే మూడు నెలలకు కూడా వంద కౌంట్ రాకపోవడం, పూర్తిగా రొయ్యల్లో ఎదుగుదల పడిపోతుండటంతో ఆక్వా రైతులు నిలువుదోపిడీకి గురై అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు.

మంచికి చోటిద్దాం.. వంచకులను తరిమేద్దాం: టీడీపీ


సమావేశంలో మాట్లాడుతున్న గంగాప్రసాద్

ఓజిలి, మార్చి 24: రాష్ట్రాభివృద్ధి, సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని రాబోయే ఎన్నికల్లో మంచికి చోటిచ్చి.. వంచకులను తరిమేద్దామని పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం, రాష్ట్ర అధ్యక్షుడు పరసారత్నం, తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్ పిలుపునిచ్చారు. గతంలో టీడీపీని వీడి వైసీపీలో చేరిన పలువురు నాయకులు తిరిగి సొంతగూటికి చేరారు. వారందరికీ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆదివారం రాత్రి ఓజిలిలో జరిగిన సమావేశంలో నేతలు మాట్లాడుతూ కుటుంబ కలహాలను సరిదిద్దుకుని ముందుకు వెళుతున్న చందంగా నాయకులు సొంతగూటికి చేరారని ఆనందం వ్యక్తం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నెలవల విజయశ్రీని గెలిపించుకోవడంతో పాటు చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవడం పార్టీ ముందున్న కర్తవ్యంగా పేర్కొన్నారు. దుష్టపాలన అంతమొందించేందుకు ఇంతలా ముందుకు వస్తున్న నాయకులు, కార్యకర్తల ఉత్సాహం చూస్తుంటే తమ కళ్లముందు రాష్ట్రానికి ఉజ్వలమైన భవిష్యత్తు కనిపిస్తోందని అన్నారు. టీడీపీలో చేరిన వారిలో కురుగొండ సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు ఎద్దల ధనుంజయరెడ్డి, రావిపాడు, ఆరిమేనిపాడు, గుర్రంకొండ మాజీ సర్పంచులు కొండూరు సుబ్బారెడ్డి, కొండూరు ఈశ్వరరాజు, కొండూరు సురేష్‌రాజు, సీనియర్ నాయకులు రవీంద్రరెడ్డి, రుద్రరాజు శంకరరాజు, ఘట్టమనేని శ్రీనివాసులనాయుడు, బిల్లు చెంగయ్య, వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట సొసైటీ మాజీ అధ్యక్షుడు శిరసనంబేటి విజయభాస్కర్‌రెడ్డి, సీనియర్ నాయకులు తిరుమూరు సుధాకర్‌రెడ్డి, ఓజిలి మండల కన్వీనరు విజయకుమార్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి దాసరి నిరంజన్, నాయుడుపేట మున్సిపల్ వైస్ ఛైర్మన్ రఫీ, తిరుపతి పార్లమెంటు ముస్లిం మైనారిటీ ఉపాధ్యక్షుడు ఎస్‌కే ఖలీల్, నెలవల రాజేష్, నలమాకల కమలాకర్, మన్మదరావు తదితరులు పాల్గొన్నారు.

విజయశ్రీని గెలిపించుకుందాం: టీడీపీ


ప్రచారంలో టీడీపీ నేతలు

పెళ్లకూరు, మార్చి 24: మండలంలోని చెన్నప్పనాయుడుపేట పంచాయతీలో ఆదివారం టీడీపీ నేతలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీని గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నంచి కృష్ణయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణారెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వట్టికుండల శేఖర్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి, నాయకులు పేరం రమేష్‌నాయుడు, మధుసూదన్ నాయుడు, కందమూడి శివకుమార్, హరినాయుడు, రామకృష్ణా, మునీష్, నరేంద్రయాదవ్, ఆరూరు రమణయ్య, సుధాకర్‌రెడ్డి, యుగంధర్, గురవయ్య, పోలయ్య, రమణయ్య, సుబ్రహ్మణ్యం, వాసు, పరుశురాం తదితరులు పాల్గొన్నారు.

విజయశ్రీ గెలుపు కోసం సమన్వయంతో కృషి: జనసేన


జనసేన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రవీణ్‌కుమార్

సూళ్లూరుపేట, మార్చి 24: టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ విజయమే లక్ష్యంగా అందరూ సమన్వయంతో ముందుకెళ్తామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక షార్ బస్టాండ్ వద్ద టీడీపీ నాయకులతో కలసి జనసేన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనకు అంతం పలికే రోజులు దగ్గరపడ్డాయన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు మహిళలకు, యువతకు ఎంతో ఉపయోగకరమన్నారు. అనంతరం రాఘవయ్యపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు ఆకుతోట రమేష్, ఏజీ కిషోర్, జనసేన మండల అధ్యక్షుడు పొన్నా కాటయ్య, టీడీపీ నాయకులు వెంకట్, బుచ్చిబాబు, సాయినారాయణ తదితరులు పాల్గొన్నారు

రక్తదానంతో ప్రాణదానం

వెంకటగిరి, మార్చి 24: రక్తదానం ప్రాణదానంతో సమానమని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. ఆదివారం స్థానిక నాగేశ్వరి పంక్షన్ హాల్‌లో సినీ హీరో రామ్‌చరణ్‌తేజ జన్మదిన వేడుకల్లో భాగంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ పులికొల్లు రాజేశ్వరరావు, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, తిరుపతి పార్లమెంటు వాణిజ్య విభాగం అధ్యక్షుడు పునుగోటి విశ్వనాథ నాయుడు, పట్టణ అధ్యక్షుడు గంగాధర్, జనసేన నాయకులు కృష్ణయ్య, మాజీ కౌన్సిలర్ బీరం రాజేశ్వరరావు, మంకు ఆనంద్, నరిసంహులు, కాపా శ్రీనివాసులు నాయుడు, చలపతి తదితరులు పాల్గొన్నారు.

12 మద్యం బాటిళ్ల స్వాధీనం

నాయుడుపేట టౌన్, మార్చి 24: పట్టణంలోని భరత్‌నగర్ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న 12 మద్యం బాటిళ్లను ఎస్ఐ గోపి ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఓజిలి మండలం రాజుపాళెం గ్రామానికి చెందిన వెంకటరమణయ్య ఎలాంటి అనుమతులు లేకుండా 12 మద్యం బాటిళ్లను తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

టీడీపీలో చేరికలు

నాయుడుపేట, మార్చి 24: సూళ్లూరుపేట మండలం కడపత్ర గ్రామానికి చెందిన మాజీ సర్పంచు నాగరాజు టీడీపీలోకి చేరారు. ఆయనకు నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం టీడీపీ కండువావేసి ఆహ్వానించారు. నాయుడుపేటలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొక్కు శంకరయ్య, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

గొడుగుల పంపిణీ

వెంకటగిరి టౌన్, మార్చి 24: స్వామి వివేకానందా యువసైన్యం ఆధ్వర్యంలో ఏపీపీ ప్రకృతికుమార్ చిరువ్యాపారులకు ఆదివారం గొడుగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివేకానందా యువసైన్యం సభ్యులు పాల్గొన్నారు.

మహిళపై దాడి

బాలాయపల్లి, మార్చి 24: మహిళపై నలుగురు దాడి చేసిన ఘటన మండలంలోని పిగిలాం గ్రామంలో శనివారం రాత్రి చోటు చోటుచేసుకుంది. బాధితురాలి కథనం మేరకు... పిగిలాం గ్రామానికి చెందిన ఈతముక్కల రత్నమ్మపై అదే గ్రామానికి చెందిన జొన్నల గడ్డ పెంచలరామయ్య, నాగరాజు, రజిత ఇంట్లోకి చొరబడి కత్తి, రాళ్లతో దాడి చేశారు.

కోడ్ అమల్లోకి వచ్చినా వైసీపీ రంగులు తొలగించరా?


వైసీపీ రంగులతో ఉన్న బస్‌షెల్టర్

గూడూరు, మార్చి 24: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి 9 రోజులు గడుస్తున్నా వైసీపీకి చెందిన రంగులను అధికారులు తొలగించలేదు. స్థానిక జాతీయ రహదారి పోటుపాళెం కూడలి సమీపంలో చెన్నై, నెల్లూరు వైపు వెళ్లే ప్రయాణికులు వేచివుండేందుకు గతంలో ఎమ్మెల్యే వరప్రసాదరావు సొంతనిధులు బస్‌షెల్టర్లను ఏర్పాటు చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ఈ బస్‌షెల్టర్లకు ముందు ముద్రించి వున్న దాత పేర్లకు పేపర్లు అతికించారు. అయితే బస్‌షెల్టర్‌లకు వున్న వైసీపీ రంగులను తొలగించలేదు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.79 కోట్లు

తిరుమల, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.2.79 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది.

క్షయ వ్యాధిని అంతం చేద్దాం


ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

పుత్తూరు అర్బన్, మార్చి 24: క్షయ వ్యాధిని అంతం చేద్దామని ప్రభుత్వాస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కృష్ణకాంత్ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ కృష్ణకాంత్ మాట్లాడుతూ క్షయ రహిత సమాజం ఆవిర్భావం కోసం ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను అందిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే నిక్షణ పోషణ యోజన పథకం కింద నెలకు రూ.500 పోషకారం కోసం ఆరు నెలల పాటు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీబీ సూపర్‌వైజర్ తిరుమలయ్య, నవీన్, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా పద్మావతీదేవి ఉయ్యాల సేవ



నారాయణవనం, మార్చి 24: మండల కేంద్రంలోని పద్మావతీ సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పంగోణోత్తర ఉత్సవాల్లో భాగంగా ఆరవ రోజు అమ్మవారి ఊంజలసేవ వేడుకగా నిర్వహించారు. ఉదయం నిత్య కైంకర్యాల అనంతరం అమ్మవారిని ప్రత్యేక తిరుమంజనం చేపట్టారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవర్లను అలంకరించి తిరుచ్చి వాహనంపై ఆలయ అంతర ప్రాకారోత్సవం నిర్వహించారు. అనంతరం ప్రధాన అర్చకులు శ్రీధర్ భట్టాచార్య అమ్మవారిని ఊంజల మండపంలో ఊయలపై కొలువదీర్చి ఊయలసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయాధికారి నాగరాజు, ఏఈవో పార్థసారధి, సూపరింటెండెంట్ ధర్మయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

వైసీపీ ప్రచారంలో వలంటీర్లు




నారాయణవనం, మార్చి 24: నారాయణవనంలో వైసీపీ నాయకులు నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు పాల్గొన్నారు. శుక్రవారం మంత్రి పెద్దిరెడ్డితో పాటు ఎంపీ గురుమూర్తి, వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన ర్యాలీలో పాలమంగళం సచివాలయానికి చెందిన వలంటీర్లు భానుప్రకాష్, బాషా, లోకేష్ పాల్గొన్నారు. వీరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని టీడీపీ నేత భాస్కరన్ చెప్పారు.

మూర్తి గురుకుల్ మృతి



పుత్తూరు అర్బన్, మార్చి 24: పట్టణానికి చెందిన ప్రముఖ అర్చకులు, గురుస్వామి మూర్తి గురుకుల్ (58) ఆదివారం మృతి చెందారు. తమిళనాడు రాష్ట్రంలోని వేలూరుకు సొంత పనుల నిమిత్తం వెళ్లిన ఆయన మృతి చెందినట్లు బంధువులు వెల్లడించారు. మూర్తి గురుకుల్ గతంలో పట్టణంలోని శివాలయంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయ అర్చకులుగా విధులు నిర్వహించారు. ఆయన మృతి పట్ల పట్టణానికి చెందిన పలువురు సంతాపం ప్రకటించారు.

టీడీపీతోనే అభివృద్ధి: భానుప్రకాష్


కరపత్రాలు అందజేస్తున్న భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, మార్చి 24: టీడీపీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని రెండవ వార్డు ఒంటిమిట్టలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో కమీషన్ల కోసమే పనులు చేశారని ధ్వజమెత్తారు. చెప్పుకోదగ్గ అభివృద్ధి ఒక్కటైనా నగరి నియోజకవర్గంలో జరిగిందా అని నిలదీశారు. కరెంటు చార్జీలు, ఆస్తి పన్ను, చెత్త పన్ను, ఆర్టీసీ చార్జీల పెంపుతో వైసీపీ ప్రభుత్వం అన్నివర్గాలను నిలువుదీపిడీ చేసిందని మండిపడ్డారు. నవరత్నాల పేరిట అర్హుల గుర్తింపులో సవాలక్ష ఆంక్షలు విధించి సంక్షేమ పథకాలకు పేదవారిని దూరం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబునాయుడు రాజమండ్రి వేదికగా ప్రకటించిన ఆరు గ్యారెంటీలు పేద, మధ్యతరగతి వర్గాలు ఆత్మగౌరవంతో జీవనం సాగించేలా రూపొందినట్లు గుర్తు చేశారు. అధికారంలోకి రానున్నది టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వమేనని, చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడం తథ్యమని వెల్లడించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీకి మద్దతుగా నిలిచి నగరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపేందుకు సహకరించాలని అభ్యర్థించారు.

చంద్రబాబును కలిసిన ఎమ్మెస్పీ నేత


చంద్రబాబుతో శివయ్య

కార్వేటినగరం, మార్చి 24: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడిని ఎమ్మార్పీఎస్ అనుబంధ సంస్థ ఎమ్మెస్పీ ఉమ్మడి చిత్తూరు జిల్లా సీనియర్ నాయకులు వావిళ్ల శివయ్య మాదిగ కలిశారు. ఆదివారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఉండవల్లిలో చంద్రబాబు నాయుడిని కలిశారు.

డ్రగ్స్ రవాణా గుట్టు తేల్చాల్సిందే: భానుప్రకాష్

వడమాలపేట, మార్చి 24: డ్రగ్స్ రవాణాలో వైసీపీ నాయకుల పాత్రపై గుట్టురట్టు చేయాల్సిందేనని నగరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ డిమాండ్ చేశారు. వడమాలపేట మండలంలోని ఎస్‌బీఆర్‌పురంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం కనుసన్నల్లోనే విదేశాల నుంచి డ్రగ్స్ రాష్ట్రానికి రవాణా అవుతోందని ఆరోపించారు. అవినీతి, అక్రమ సంపాదనతో కోట్లు దండుకుని ఓట్లు సంపాదించుకోవాలని చూస్తున్న వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఐదేళ్ల పాలనలో అభివృద్ధి కంటే దోచుకోవడంపైనే జగన్ దృష్టి పెట్టారని ఆరోపించారు. రాష్ట్రంలో టీడీపీ గెలుపు పవనాలు వీస్తున్నాయని, ఒకసారి చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తంగా వైసీపీని ఇంటికి పంపేందుకు ఓటర్లు సిద్ధంగా ఉన్నారని భానుప్రకాష్ అన్నారు.



టీడీపీలో చేరికలు

వడమాలపేట, మార్చి 24: మండలంలోని టీసీ అగ్రహారం గ్రామస్థులు ఆదివారం టీడీపీలో చేరారు. వారికి నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ పార్టీ కండువాలు ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ప్రగతి కోసం నగరిలో టీడీపీ గెలుపుకోసం కృషి చేసే ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. టీడీపీలో చేరిన వారిలోధనంజయరెడ్డి, సుబ్బారెడ్డి, చంద్రబాబు, సావిత్రమ్మ, జానకి రామిరెడ్డి తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి దాముయాదవ్, దాము ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

గురుకుల పాఠశాలకు వంట సామగ్రి వితరణ



గురుకుల పాఠశాలకు వంట సామగ్రి వితరణ చేస్తున్న శ్రీసిటీ ఫౌండేషన్

శ్రీసిటీ, మార్చి 24: శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీలోని ఎన్ఎస్ ఇన్‌స్ట్రూమెంట్స్ పరిశ్రమ, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యతలో భాగంగా సత్యవేడులోని మహాత్మ జ్యోతిరావు పూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలకు లక్షరూపాయల విలువచేసే వంట సామగ్రిని వితరణ ఇచ్చింది. ఎన్ఎస్ ఇన్‌స్ట్రూమెంట్స్ శ్రీసిటీ యాజమాన్యానికి పాఠశాల సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ ఇన్‌స్ట్రూమెంట్స్ పరిశ్రమ అధికారులు మల్లీశ్వరి, మహేష్, సాయికృష్ణశ్రీ, లక్ష్మి, శ్రీసిటీ ప్రతినిధులు వై.రమేష్, సురేంద్రకుమార్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఖాళీ అవుతున్న వైసీపీ


పార్టీలో చేరిన వారితో సుధీర్‌రెడ్డి

తొట్టంబేడు, మార్చి 24: శ్రీకాళహస్తి, తొట్టంబేడు మండలాల్లోని వైసీపీ నాయకులు టీడీపీలో చేరుతుండడంతో రోజు రోజుకూ ఆ పార్టీ ఖాళీ అవుతోందని బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. ఊరందూరులోని సుధీర్‌రెడ్డి స్వగృహంలో ఆదివారం శ్రీకాళహస్తి మండలంలోని చెర్లోపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు రాంబాబునాయుడు ఆధ్వర్యంలో 30 కుటుంబాల యువత టీడీపీలో చేరారు. సుధీర్‌రెడ్డి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కామేష్‌యాదవ్, తాటిపర్తి రవీంద్రనాథ్‌రెడ్డి, బొల్లినేని జగన్నాథంనాయుడు, బత్తిరెడ్డి పాల్గొన్నారు.

● జనసేన పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కార్యదర్శి అంజూరు చక్రధర్ బొజ్జల సుధీర్‌రెడ్డిని ఆయన స్వగృహంలో కలిసి అభినందనలు తెలియజేశారు. జనసైనికులు రామయ్య, ప్రసాద్, ఫయాజ్, చలపతి, శరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బలిజసేన సత్యవేడు అధ్యక్షుడిగా మోహన్



కేవీబీపురం, మార్చి24: మండలంలోని అంజూరు గ్రామానికి చెందిన పొనపాల మోహన్ సత్యవేడు నియోజకవర్గ బలిజసేన అధ్యక్షుడుగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ సంఘం వ్యవస్థాపకులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు పం పారు. ఈ సందర్భంగా మోహన్ మాట్లాడుతూ కాపు, బలిజ, తెలగ, ఒంటరి, మున్నూరు కాపు, తూర్పు కాపుల సంక్షేమానికి కృషిచేస్తానని తెలియజేశారు.

అక్క హత్య.. మనస్తాపంతో తమ్ముడి ఆత్మహత్య


బాలమురగయ్య (ఫైల్ ఫొటో)

వరదయ్యపాళెం, మార్చి 24: అక్క హత్యకు గురికావడంతో తమ్ముడు మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన వరదయ్య పాళెంలో చోటుచేసుకుంది. ఎస్ఐ ప్రతాప్ కథనం మేరకు.. బీఎన్‌కండ్రిగ మండలం కంచన పుత్తూరుకు చెందిన ప్రత్యేక ప్రతిభావంతుడు బాలమురగయ్య (26) ఇందిరానగర్ పంచాయితీ పద్మావతి పురంలో కాపురం ఉంటున్నాడు. వరదయ్యపాళెం స్టేట్‌బ్యాంకు ఎదురుగా నెట్ కేంద్రాన్ని నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఇటీవల ఆయన అక్క హత్యకు గురైంది. నాటి నుంచి మనస్తాపానికి గురై శనివారం పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక ప్రైవేటు ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం తిరుపతి రుయాలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మధ్యాహ్నం మరణించాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సుధీర్‌రెడ్డిని గెలిపించండి

తొట్టంబేడు, మార్చి 24: వచ్చే ఎన్నికల్లో తన భర్త బొజ్జల సుధీర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ఆయన సతీమణి రిషితారెడ్డి కోరారు. మండలంలోని గుండేలిగుంట పంచాయతీలోని విరుపాక్షిపురం, కొత్తకండ్రిగ గ్రామాల్లో ఆమె ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రకార్యదర్శి గాలి చలపతినాయుడు, మాజీ ఎంపీటీసీ వెంకటాచలం, మండల అధ్యక్షుడు మురళి నాయుడు, జయచంద్రనాయుడు, మునిరాజనాయుడు, చంచయ్య నాయుడు, కన్నలి ప్రతాప్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, జనసేన నాయకులు, కొట్టేసాయి, మహేష్ బాలాజీరెడ్డి, కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మీడియా కో-ఆర్డినేటర్‌గా శామ్యూల్



నాగలాపురం, మార్చి 24: కాంగ్రెస్ పార్టీ తిరుపతి జిల్లా మీడియా కో ఆర్డినేటర్‌గా నాగలాపురానికి చెందిన శామ్యూల్‌కుమార్ నియమితుల య్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేస్తానని తెలిపారు. తనకు ఈ పదవి అప్పగించిన ఏపీసీసీ ప్రెసిడెంట్ వైఎస్ షర్మిలకు, మీడియా సెల్ చైర్మన్ తులసిరెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

సూపర్‌సిక్స్ పథకాలతో పేదలకు లబ్ధి


గోవిందవరం గిరిజనకాలనీలో ప్రచారం

ఏర్పేడు, మార్చి 24: చంద్రబాబు ప్రకటించి సూపర్‌సిక్స్ పథకాలతో పేద ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని టీడీపీ సీనియర్ నాయకులు పేరం నాగరాజునాయుడు అన్నారు. ఏర్పేడు మండలం గోవిందవరం గిరిజన కాలనీ, మర్రిమంద గ్రామాల్లో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మహేష్‌నాయుడు, చలపతినాయుడు, నాగేంద్ర చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అడుగూ ముందుకు పడలేదు

● తిరుపతిలో పునాదులకే పరిమితమైన బీసీ భవన్

● ఇదీ బీసీల పట్ల వైసీపీ పాలకుల చిత్తశుద్ధి


పునాదుల వద్ద ఆగిపోయిన పనులు

తిరుపతి (జీవకోన), మార్చి 24: తిరుపతి, చంద్రగిరి నియోజకవర్గాల పరిధిలోని బీసీలకు ఉపయోగకరంగా ఉండేందుకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం బీసీ భవన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. తిరుపతి అర్బన్ మండలం శెట్టిపల్లి పంచాయతీ సమీపంలోని మంగళం-శెట్టిపల్లి ప్రధాన మార్గంలో సర్వే నెంబర్ 117/2లో మూడు ఎకరాల స్థలాన్ని కేటాయించింది. భవన నిర్మాణానికి రూ199.90లక్షల నిధుల మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పనులను పర్యవేక్షించే బాధ్యతను తుడాకు అప్పగించింది. తుడా పాలకవర్గం వెనువెంటనే పనులకు శ్రీకారం చుట్టింది. భూమి చదును, పునాదుల తవ్వకం, పిల్లర్ల ఏర్పాటు పనులు చకచకసాగాయి. అయితే 2019లో ఎన్నికలు జరగడం, వైసీపీ అధికారంలోకి రావడంతో పనులు ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయ్యాయి. నిత్యం బీసీల జపం చేసే పాలకులు అ సామాజికవర్గం సౌకర్యం కోసం నిర్మించతలపెట్టిన భవన నిర్మాణాన్ని పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రస్తుతం ఆ భవన నిర్మాణానికి కేటాయించిన స్థలంలో దట్టమైన ముళ్ల పొదలు దర్శనమిస్తున్నాయి.

చంద్రబాబుకు శ్రీవారి చిత్రపటం



శ్రీకాళహస్తి, మార్చి 24: గాండ్ల సాధికార సమితి సభ్యులు కన్నవరం హరిబాబు టీడీపీ అధినేత చంద్రబాబును ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత గాండ్ల సామాజిక వర్గ ప్రజలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం చంద్రబాబుకు శ్రీవారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ విశాలాక్షి సామాజిక వర్గం నాయకులు ప్రభాకర్ హరగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

పల్లెవెలుగు బస్సును ఢీకొన్న ఇసుక లారీ



పిచ్చాటూరు, మార్చి 24: పిచ్చాటూరు మండలం వేలూరు గ్రామం వద్ద పల్లె వెలుగు బస్సును ఇసుక లారీ ఢీకొంది. దీంతో బస్సు కరెంటు స్తంభాన్ని ఢీకొట్టి నేలమట్టమైంది. ఎవరికి ఎలాంటి ప్రాణపాయం లేకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

రేణిగుంట, మార్చి 24: మండల పరిధిలో మద్యం తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కరకంబాడి పంచాయతీ పరిధిలో తారకరామానగర్‌లో బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న వెంకటేష్ అనే వ్యక్తి నుంచి 70 చీప్ లిక్కర్ బాటిళ్లను, ఆంజనేయపురం చెక్‌పోస్టు వద్ద నాగయ్య అనే వ్యక్తి నుంచి ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ అరుణ్‌కుమార్, సీఐ మల్లికార్జున్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎయిర్ గన్ షూటింగ్‌పై శిక్షణ


ప్రశంసా పత్రాలు అందుకున్న విద్యార్థులు

శ్రీకాళహస్తి, మార్చి 24: శ్రీకాళహస్తిలో సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఆదివారం విద్యార్థులకు ఎయిర్ గన్ షూటింగ్‌పై శిక్షణ ఇచ్చారు. ఏపీ స్పోర్ట్స్ ఫిజికల్ ఫిట్నెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాస్టర్ ధనుష్ విద్యార్థులకు గన్ను గురిపెట్టే మెళకువలను వివరించారు. హాజరైన విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఐఐటీలో ముగిసిన హై-ఎండ్ వర్క్‌షాప్


వర్క్‌షాప్‌కు హాజరైన ప్రొఫెసర్లు, విద్యార్థులు

ఏర్పేడు, మార్చి 24: తిరుపతి ఐఐటీలో గత నెల 18న ప్రారంభమైన సివిల్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ సిమెంటీయస్ మెటీరియల్స్, లాబొరేటరీ టెస్టింగ్‌పై హై ఎండ్ వర్క్‌షాప్ ఆదివారంతో ముగిసింది. యాక్సిలేటర్ విజ్ఞాన్ పథకం కింద సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డు స్పాన్సర్ చేసి సిమెంటీఎస్ మెటీరియల్స్, లేబొరేటరీ టెస్టింగ్‌ల క్యారెక్టరైజేషన్‌పై ఈ వర్క్‌షాప్ విద్యార్థులకు ఎన్నో మెళకు వలను నేర్పింది. ఈ వర్క్‌షాప్‌లో వివిధ ఐఐటీల నుంచి ప్రొఫెసర్ల నేతృత్వంలో సాంకేతిక, ప్రయోగశాల సెషన్‌ల శ్రేణిని ప్రదర్శించారు. ఐఐటీ గాంధీనగర్ నుంచి డాక్టర్ శివతేజ ఆదివారం ఉదయం సిమెంటీ యస్ మెటీరియల్స్‌పై చేసిన ప్రసంగం విద్యార్థులను ఆకట్టుకుంది. ఐఐటీ మద్రాస్ నుంచి ప్రఖ్యాత ప్రొఫెసర్ రవీందరగెట్టు ద్వారా సిమెంటియస్ సిస్టమ్ క్లోజ్ -లూప్ టెస్టింగ్‌పై మధ్యాహ్నం సెషన్ జరిగింది. ఈ కార్యకరమంలో ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ కేఎన్ సత్యనారాయణ, పాల్గొన్నారు.

కలెక్టర్ ఉత్తర్వులు బేఖాతర్

● ఏర్పేడులో పంచాయతీ కార్యదర్శుల మార్పిడి ● ఆందోళనలో కార్యదర్శులు

ఏర్పేడు, మార్చి 24: ఏర్పేడు ఎంపీడీవో గిడ్డయ్య వైసీపీ నాయకుల సూచనల మేరకు కలెక్టర్ ఉత్తర్వులను బేఖాతర్ చేస్తూ పంచాయతీ కార్యదర్శులను వేరే పంచాయతీకి మార్పులు చేస్తున్నారు. దీంతో మండలంలో పనిచేసే పంచాయతీ కార్యదర్శులు ఆందోళన చెందుతున్నారు. పెనగడం పంచాయతీ కార్యదర్శిగా అశోక్‌ను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు ఇచ్చారు. అయితే ఆయనను పెనగడంలో పనిచేయించకుండా రావిళ్లవారికండ్రిగకు వైసీపీ నాయకులు అండదండలతో డెవలప్‌మెంట్ గ్రౌండ్ కింద బదిలీ చేశారు. రావిళ్లవారికండ్రిగ పంచాయతీలో పనిచేసే యమున అనే కార్యదర్శిని పెనగడానికి బదిలీ చేశారు. కోబాక పంచాయతీ కార్యదర్శి లోకముని అక్కడ ఓ ఎంపీటీసీకి నచ్చకపోవడంతో ఆయనను ఎండీపుత్తూరుకు బదిలీ చేశారు. పల్లం పంచాయతీలో పనిచేస్తున్న కార్యదర్శి సుధాకర్ స్థానిక వైసీపీ నాయకులకు నచ్చకపోవడంతో ఆయనను వికృతమాల పంచాయతీకి బదిలీచేశారు. వికృతమాలలో పనిచేస్తున్న రోశయ్యను పల్లం పంచాయతీకి పంపించారు. ఇలా మండలంలో సుమారు పది పంచాయతీలకు కలెక్టర్ ఉత్తర్వుల ప్రకారం అధికారులు పనిచేయడంలేదు.

అవగాహనతో క్షయ నియంత్రణ


శ్రీకాళహస్తిలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

శ్రీకాళహస్తి, మార్చి 24: అవగాహనతోనే క్షయ వ్యాధిని నియంత్రించవచ్చని శ్రీకాళహస్తి టీబీ సూపర్‌వైజర్ రామకృష్ణయ్య తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి నిర్మూలన దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి నుంచి వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ చేశారు. క్షయ వ్యాధి గ్రస్తులకు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు ప్రతి నెలా రూ.500 నగదును బ్యాంకు ఖాతాలో జమ చేస్తుందని వివరించారు. ఈ కార్యక్ర మంలో ల్యాబ్ టెక్నీషియన్ గుణవతి, జ్ఞాన ప్రసూనాంబిక నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ లత, నర్సింగ్ విద్యార్థులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నీర్పాకోట, కంచనపుత్తూరు, బీఎన్‌కండ్రిగ గ్రామాలలో క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ దివాకర్, సీహెచ్‌వో వెంకటేశ్వర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న బొలెరో.. కర్ణాటక వాసి మృతి


మృతిచెందిన చంద్రశేఖర్

తొట్టంబేడు, మార్చి 24: ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొంది. ఈ ఘటనలో కర్ణాటకకు చెందిన డ్రైవర్ మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారిలోని పొయ్యి వద్ద చోటుచేసుకుంది. తొట్టంబేడు ఎస్ఐ రాఘవేంద్ర కథనం మేరకు.. కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా శ్రీనివాసపురానికి చెందిన చంద్రశేఖర్ (36), చిత్తూరు జిల్లా భైరెడ్డిపల్లి మండలం అల్లపల్లి గ్రామానికి చెందిన రవిచంద్రారెడ్డి డ్రైవర్లు. వీరు 22వ తేదీ శుక్రవారం బొలెరో వాహనంలో పూల లోడుతో రాజమండ్రికి వెళ్లారు. అక్కడ పూలు దించేసి ఆదివారం తిరిగి బయలుదేరారు. రవిచంద్రారెడ్డి డ్రైవింగ్ చేస్తున్నాడు. పొయ్యి వద్ద రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొన్నాడు. డ్రైవర్ పక్కన కూర్చున్న చంద్రశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని భార్య రోజా ఆస్పత్రికి చేరుకుంది. రవిచంద్రా రెడ్డిపై కేసు నమోదు చేసి న్యాయం చేయాలని కోరింది.

వ్యూహాత్మకంగా టీడీపీ ప్రచారం


వాకి టాకీలు

శ్రీకాళహస్తి, మార్చి 24: ఎన్నికల ప్రచారంలో టీడీపీ నేతలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ఇటీవల శ్రీకాళహస్తిలో టీడీపీ శ్రేణులపై జరిగిన దాడులను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి కట్టుదిట్టంగా ప్రచారం చేసేలా కార్యాచరణ రూపొందించారు. రెండు నెలల క్రితం శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీరామ్ నగర్ కాలనీ వద్ద టీడీపీ ప్రచార రథంపై వైసీపీ నాయకులు కొందరు దాడి చేసిన విషయం తెలిసిందే. అదే తరహాలో 15 రోజుల క్రితం శ్రీకాళహస్తి పట్టణ నడిబొడ్డులోని పుర పాలక సంఘ కార్యాలయం ఎదుట వైసీపీ కార్యకర్త టీడీపీ ప్రచారరథం పై దాడి చేశాడు. ప్రచారరథం డ్రైవర్‌ను విచక్షణారహితంగా రోడ్డుపై అందరూ చూస్తుండగానే వెంటాడి కొట్టాడు. టీడీపీ శ్రేణులు అక్కడికి చేరుకోవడంతో వైసీపీ కార్యకర్త ఆర్టీసీ బస్సుకు అడ్డంగా పడుకుని హల్చల్ చేశాడు. ఇక రెండేళ్ల క్రితం పాలసరఫరా సంఘం ఎన్నికల నామినేషన్ రోజున పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి వద్ద టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు కారుపై వైసీపీ నేత రాళ్లతో దాడి చేశాడు. అంతటితో ఆగకుండా స్థానిక ప్రజలందరూ చూస్తుండగానే గాలి చలపతి నాయుడుతో పాటు మరి ఇద్దరు టీడీపీ నాయకులపై దారుణంగా దాడి చేశారు. ఇలాంటి దుర్ఘటనలను చాకచక్యంగా ప్రతి ఘటించేందుకు బొజ్జల సుధీర్‌రెడ్డి ముందుకు సాగుతున్నారు. ఎన్నికల ప్రచారంలో క్షణక్షణం అప్రమత్తంగా అందరూ సమాచారం అందుకునేలా ప్రణాళిక రూపొందించారు. 20 కిలోమీటర్ల పరిధిలో పనిచేసే నాలుగు వాకి టాకీలను సిద్ధం చేశారు. ప్రచారం, అలాగే ఎన్నికల రోజున ఎలాంటి దాడులు జరిగినా వెంటనే అందరూ అప్రమత్తమయ్యేలా వైర్లెస్ సెట్లను ఉపయోగించనున్నారు. వ్యూహాత్మకంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

వేడుకగా ఊంజల్ సేవ



శ్రీకాళహస్తి, మార్చి 24: పౌర్ణమి విశేష తిదిని పురస్కరించుకుని శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం స్వామి, అమ్మవార్లకు ఊంజల్ సేవ వేడుకగా నిర్వహించారు. ఆలయంలోని అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించారు. అర్చకులు ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. అనంతరం అలంకార మండపం లో ఊయలపై అలరారుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. చతుర్మాడ వీధుల్లో నగరోత్సవం నిర్వహించారు. భక్తులు కర్పూర హారతులు పట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, సభ్యులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

బై బై..వైసీపీ

● శ్రీకాళహస్తిలో హోరెత్తిన నినాదాలు ● టీడీపీలోకి పెరిగిన వలసలు

● అధికార పార్టీని వీడిన ఇద్దరు సీనియర్ నాయకులు

శ్రీకాళహస్తి, మార్చి 24: శ్రీకాళహస్తి పట్టణం బై బై వైసీపీ నినాదాలతో హోరెత్తింది. వైసీపీకి చెందిన సీనియర్ నాయకులు లక్కమనేని మధు, మాజీ కౌన్సిలర్ రవీంద్రబాబు సుమారు 1000 మంది అనుచరులతో ఆ పార్టీని వీడి టీడీపీ గూటికి చేరారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అధికార పార్టీకి రోజుకో షాక్ తగులుతూనే ఉంది. అధికార పార్టీలో కీలకంగా వ్యవహరించిన పలువురు నాయకులు ఒక్కొక్కరుగా దూరమవుతూ వస్తున్నారు. రెండు నెలల క్రితం ముగ్గురు జడ్పీటీసీలు సైకిలెక్కారు. ఎమ్మెల్యే అభ్యర్థిగా సుధీర్‌రెడ్డిని ప్రకటించాక ఊహించిన దానికన్నా వలసలు ఎక్కువయ్యాయి. మండలాల నుంచి పెద్దఎత్తున వైసీపీపై విసుగుచెందిన నాయకులు, కార్యకర్తలు సుధీర్‌రెడ్డి సమక్షంలో టీడీపీ తీర్థం స్వీకరిస్తున్నారు. ఈ క్రమంలోనే శ్రీకాళహస్తి పట్టణంలో తాజాగా వైసీపీ సీనియర్ నాయకులు లక్కమనేని మధు, మాజీ కౌన్సిలర్ రవీంద్రబాబు పార్టీలో చేరారు. తొలుత పట్టణంలోని వెలమపాళెం నుంచి ర్యాలీ చేపట్టారు. సుధీర్‌రెడ్డి, కూటమి శ్రేణులు పెద్దఎత్తున అక్కడికి చేరుకుని ర్యాలీలో కాలు కదిపారు. మొత్తంగా మూడు వేల మందితో పట్టణంలో ర్యాలీ సాగింది. పట్టణ పురవీధులన్నీ బై.. బై.. వైసీపీ నినాదాలతో మార్మోగాయి. టీడీపీ కార్యాలయం వద్దకు ర్యాలీ చేరుకుంది. వలస నేతలకు బొజ్జల సుధీర్ రెడ్డి కండువా కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. వారి వారి అనుచరులు వెయ్యిమంది పసుపు కండువాలు ధరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బృందమ్మ, కోడలు రిషితారెడ్డి, సీనియర్ నాయకులు జంగాలపల్లి తులసి రామిరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు, రెడ్డివారి గురవారెడ్డి, పట్టణ అధ్యక్షులు విజయ్‌కుమార్, తిరుపతి పార్లమెంట్ కోశాధికారి కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు. ● శ్రీకాళహస్తి 28వ వార్డు మాజీ కౌన్సిలర్, బీజేపీ నాయకులు చంగల్‌రాయుల రెడ్డిని సుధీర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు.



ర్యాలీలో జన సందోహం, లక్కమనేని మధును పార్టీలోకి ఆహ్వానిస్తున్న బొజ్జల సుధీర్ రెడ్డి

వెండి వెన్నెల్లో.. దక్షిణ కైలాసం



నిండు పున్నమి వేళ్ల వెండి వెన్నెల కాంతుల్లో దక్షిణ కైలాస క్షేత్రం దేదీప్యమానంగా ప్రకాశించింది. శ్రీకాళహస్తిలో కైలాస పర్వతంపై ఉన్న పార్వతీ పరమేశ్వరుల శిరస్సుపై పున్నమి చంద్రుడు అబ్బుర పరిచేలా ఆవిష్కృతమయ్యారు. ఈ దృశ్యం పట్టణ వాసులను విశేషంగా ఆకట్టుకుంది.

- శ్రీకాళహస్తి

విభేదాలు వీడి కలిసి సాగుదాం

వరదయ్యపాళెం, మార్చి 24: విభేదాలు వీడి కలిసి సాగుదామని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ నాగరాజు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గ అభ్యర్థిగా కోనేటి ఆదిమూలాన్ని టీడీపీ అధిష్ఠానం ప్రకటించిందన్నారు. పార్టీ నిర్ణయమే శిరోధార్యమన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ సైకిల్ గుర్తుపై ఓటు వేసి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఉందన్నారు.

చేనేత కుటుంబ ఆత్మహత్యకు కారణమైన వారిని శిక్షించాలి

వరదయ్యపాళెం, మార్చి 24: ఒంటిమిట్ట మాధవరం చేనేత కుటుంబం పాలా సుబ్బారావు, పద్మావతి, వినయ ఆత్మహత్యకు గల కారణాలు విచారించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని చేనేత కార్మిక యూనియన్ నాయకులు గుత్తి త్యాగరాజు డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ భూ రాబందులపై చర్యలు తీసుకోవాలన్నారు.

వేదోక్తంగా సత్యనారాయణ వ్రతం

వరదయ్యపాళెం, మార్చి 24: మండలంలోని గోవర్ధనపురంలోని లోకా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం వేదోక్తంగా సత్య నారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లోకా ఫౌండేషన్ ఆధ్యాత్మిక విభాగం కో-ఆర్డినేటర్ బొప్పన రమేష్, లోకేష్ దాసాజీ, లక్ష్మీదాసాజీ, సునీల్‌జీ తదితరులు పాల్గొన్నారు.

బలిజ భవనం నిర్మాణమే కర్తవ్యం

శ్రీకాళహస్తి, మార్చి 24: బలిజ భవనం నిర్మాణం పూర్తి చేయడమే తమ ప్రథమ కర్తవ్యమని ఆసామాజిక వర్గం నాయకులు తీర్మానించారు. శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం శ్రీకృష్ణదేవరాయ బలిజ సంక్షేమ సంఘం మొదటి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముక్కంటి ఆలయ చైర్మన్‌గా రెండో దఫా నియమితులైన అంజూరు శ్రీనివాసులును సన్మానించారు. సంఘం ప్రెసిడెంట్ కృష్ణయ్య, నాయకులు గాజుల సత్యనారాయణ, కంఠా ఉదయ్ కుమార్ పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలు గర్హనీయం

వరదయ్యపాళెం, మార్చి 24: కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న బీజేపీని, దాని మిత్రపక్షాలను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నాదొరై పిలుపునిచ్చారు. వరదయ్యపాళెంలో ఆదివారం నిర్వహించిన ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోకవర్గ కార్యదర్శి చిన్నిరాజ్, చంద్రబాబు, చంద్రవాణి, కోటి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాల కవాతు

రేణిగుంట, మార్చి 24: గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలో కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు ఆదివారం కవాతు నిర్వహించారు. సీఐ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో విప్పమాని పట్టెడ, సూరప్పకశం, కొత్తూరు, గాజులమండ్యం పరిధిలో ఉన్న సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద కవాతు చేపట్టారు. ఎస్ఐ సునీల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కేవీబీపురం: రానున్న ఎన్నికల్లో ప్రజలు ప్రశాంతంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్ఐ నజిరుద్దీన్ కోరారు. ఆదివారం అంజూరు, రాజులకండ్రిగ, శ్రీనివాసపురం గ్రామాలలో కేంద్ర సాయుధ బలగాలతో కవాతు నిర్వహించారు.


అంజూరులో కవాతు నిర్వహిస్తున్న సాయుధ దళాలు